
TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:39 THURSDAY ,JUNE 18,2026 PAGES:8 COST: 4 /-
ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 39 గురువారం 18 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-



## హైదరాబాద్ డెంటల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం

- 12 మంది విద్యార్థులపై కేసు
- హైదరాబాద్ డెంటల్ కాలేజీలో జూనియర్లపై ర్యాగింగ్
- 12 మంది సీనియర్ విద్యార్థులపై కేసు నమోదు
- ఆరుగురు విద్యార్థులను ఆరు నెలల పాటు సస్పెండ్ చేసిన కాలేజీ
- ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ప్రిన్సిపల్ హెచ్చరిక

హంస కలం వార్త : హైదరాబాద్‌లోని ప్రభుత్వ డెంటల్ కళాశాలలో ర్యాగింగ్ కలకలం రేపింది. తమ జూనియర్ విద్యార్థులను వేధించారనే ఆరోపణలపై 12 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో నగరంలోని విద్యాసంస్థల్లో ర్యాగింగ్ భూతం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రభుత్వ డెంటల్ కాలేజీ విద్యార్థులు ప్రస్తుతం బస చేస్తున్న మిగతా2లో

# విద్యతోనే జీవితాల్లో మార్పు..

## ప్రభుత్వ పాఠశాలలను చిన్నచూపు చూడొద్దు: రేవంత్ రెడ్డి

- ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన సీఎం
- విద్యారంగానికి రూ.27 వేల కోట్ల వ్యయం చేస్తున్నట్లు వెల్లడి
- త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీ
- కులవివక్ష నిర్మూలన లక్ష్యంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్
- ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామన్న సీఎం






హంసకలం వార్త :తెలంగాణ భవిష్యత్ పునర్నిర్మాణం అద్దాల మేడల్లో కాదని.. తరగతి గదుల్లోనే ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులపై పెట్టేది ఖర్చు కాదని, రాష్ట్ర భవిష్యత్తు కోసం పెట్టే పెట్టుబడని తెలిపారు. విద్య ఒక్కటే జీవితాలను సమూలంగా మార్చగలదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా భవిష్యత్తులో ప్రధాని, ముఖ్యమంత్రి, ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజినీర్లు, మిగతా2లో

## తెలంగాణలో మేలుజాతి వంగడాల సాగుకు ప్రోత్సాహం కల్పిస్తాం




రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.

# పోలవరం ముంపుపై కేంద్రం కీలక లేఖ..

## కాగితాలపై కాదు క్షేత్రస్థాయిలో చూపించాలన్న హరీశ్ రావు




- తెలంగాణ పరిధిలో ముంపు ప్రాంతాలను ఆదుకుంటామన్న పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ
- పీపీఏ రక్షణ హామీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్న హరీశ్ రావు
- ఇచ్చిన హామీ ఫైళ్లకే పరిమితం కాకుండా చూడాలని విన్నపం



## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి థ్యాంక్స్ చెప్పిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్‌ను పరామర్శించిన పవన్
- హనుమకొండ పర్యటనకు సహకరించిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు
- తెలంగాణ పోలీసు శాఖకు, అధికారులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపిన పవన్
- తెలంగాణ ప్రజలు చూపిస్తున్న ప్రేమను జీవితాంతం గుర్తుంచుకుంటానని ట్వీట్
- నిరంజన్ ధైర్యం, ఆత్మవిశ్వాసం స్ఫూర్తిదాయకమని ప్రశంసలు

హంస కలం వార్త : ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన మాన వత్వాన్ని మరోసారి చాటుకున్నారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమానిని పరామ ర్శించేందుకు ఆయన ఈరోజు వరంగల్ జిల్లా హనుమకొండకు వెళ్లారు. పర్యటన ముగిసిన అనం తరం, తనకు పూర్తి సహాయ సహ కారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మిగతా2లో

## ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతలో వారికే

# తొలి ప్రాధాన్యం




హంస కలం వార్త : ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతలో గుడిసె వాసులకే తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లపై గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 75 వేల గుడిసెల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామన్నారు. అర్హుల ఎంపిక పూర్తి పారదర్శకతతో చేపడతామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేయని గుడిసె వాసులకు మరో అవకాశం ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. రెండో విడతలో 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం –మిగతా2లో



# సోలార్ ప్లాంట్ పెట్టండి, లాభాలు ఆర్జించండి

- నాబార్డు ద్వారా రుణం పొందండి
- సహకార సంఘాలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు

హంస కలం వార్త

సహకార సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటే పెద్ద ఎత్తున లాభాలు ఆర్జించే అవకాశం ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. 1 మెగావాట్ సామర్థ్యంతో ఏర్పాటు చేసే ఒక్కో సోలార్ ప్లాంట్ ద్వారా ఏటా రూ.50 లక్షల ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు నాబార్డు ద్వారా రుణ సౌకర్యం 2లో

## నియోజకవర్గం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి జూపల్లి

కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మౌలిక వసతులు

గోపాల్ దీన్నే గ్రామంలో నూతన సబ్ స్టేషన్ ను ప్రారంభం





హంస కలం వార్త :కొల్లాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం శ్రీకారం చుట్టారు.వీపనగండ్ల మండలం గోపాలదిన్నె గ్రామంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని టెంకాయ కొట్టి మంత్రి ప్రారంభించారు.సబ్ స్టేషన్ నిర్మాణంతో గోపాల్ దీన్నే, రంగవరం గ్రామాల ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు ఉండవని మంత్రి మిగతా2లో

## పరిస్థితి అనుకూలంగా ఉండకపోవచ్చు...

# వరి సాగు తగ్గించండి

- ఎల్‌నినో ప్రభావం వల్ల జూన్, జులై నెలల్లో వర్షాలు తగ్గే అవకాశం ఉందన్న తుమ్మల
- వరి సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు అడుగులు వేయడం మంచిదని సూచన
- ఎరువుల గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యాఖ్య



హంస కలం వార్త : ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వల్ల జూన్, జులై నెలల్లో వర్షాలు కాస్త తగ్గే సూచనలు ఉన్నాయని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, ఎక్కువ నీరు అవసరమయ్యే వరి సాగును కాస్త తగ్గించి, మంచి లాభాలనిచ్చే ఆయిల్‌పామ్ వైపు దృష్టి పెట్టాలని రైతులను ఆయన కోరారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకునేలా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలతో ప్రత్యామ్నాయ పంటల వైపు అడుగులు వేయడం మిగతా2లో

హంస కలం వార్త
HAMSA KALAM VARTA
గురువారం 18 జూన్ 2026

# విద్యతోనే జీవితాల్లో మార్పు.. ప్రభుత్వ పాఠశాలలను చిన్నచూపు చూడొద్దు

-మొదటి పేజీ తరువాయి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా భవిష్యత్తులో ప్రధాని, ముఖ్యమంత్రి, ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, ప్రజాప్రతినిధులు కావచ్చని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవడాన్ని ఎవరూ చిన్నతనంగా భావించవద్దని సూచించారు.,రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను బుధవారం ప్రారంభించిన సీఎం అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ పాఠశాల రాష్ట్రం మొత్తానికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.27 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రపంచస్థాయి విద్యా సంస్థల వరకు పరిశీలించి విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి సమగ్ర నివేదిక అందించారని చెప్పారు. దాని ఆధారంగానే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ల ఆలోచనకు రూపం ఇచ్చామని వివరించారు. నాణ్యమైన విద్య అందరికీ చేరాలన్న లక్ష్యంతో ఆరుట్ల గ్రామాన్ని ఎంచుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ పాఠశాలలో ప్రవేశాల కోసం భారీ స్పందన రావడం సంతోషకరమని సీఎం పేర్కొన్నారు. 'నో అడ్మిషన్స్' బోర్డు పెట్టాల్సిన పరిస్థితి రావడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని అన్నారు. పాఠశాల సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. నిజాం పాలన, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి వంటి మహనీయుల స్ఫూర్తి ఉన్న నేలపై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. వారి పోరాట స్ఫూర్తి ఇక్కడి విద్యార్థుల్లోనూ కనిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తన సొంత నియోజకవర్గంలో ఈ పాఠశాలను ప్రారంభించే అవకాశం ఉన్నప్పటికీ, ఆరుట్లను ఎంచుకోవడం వెనుక ఇదే కారణమని చెప్పారు. విద్యతో పాటు నైపుణ్యాలు కూడా అవసరమని సీఎం పేర్కొన్నారు. కేవలం చదువు మాత్రమే సరిపోదని, విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలు పెరగాలని అన్నారు. అందుకే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. అక్కడ శిక్షణ పొందిన యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని వెల్లడించారు. క్రీడల రంగంలోనూ తెలంగాణ మరింత ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఆరుట్ల విద్యార్థులు ఫుట్‌బాల్ అద్భుతంగా ఆడారని ప్రశంసించారు. క్రీడల్లో వెనుకబాటుతనాన్ని అధిగమించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువచ్చి యువ క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపాలని ప్రయత్నించినట్లు తెలిపారు. త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు. సమాజంలో కులవివక్షను తగ్గించే దిశగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను తీసుకొస్తున్నామని సీఎం చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారానే గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలని సంకల్పించామని పేర్కొన్నారు. విద్యార్థులకు అత్యుత్తమ వసతులు, నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. తరగతి గదులు, వసతి సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

# తెలంగాణలో మేలుజాతి వంగడాల సాగుకు ప్రోత్సాహం కల్పిస్తాం

రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ అడుగులు వేయాలని సూచించారు. పేదలు సన్నబియ్యం తినాలని.. రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. సచివాలయంలో భట్టివిక్రమార్క అధ్యక్షతన బుధవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశం అయింది. ఈ భేటీకి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు, నిల్వ సదుపాయాలపై ఈ సమీక్షలో చర్చించామని తెలిపారు.

**ఆ పంటలకు ప్రాధాన్యం ఇస్తాం..**

నాణ్యమైన వరి రకాల సాగుకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఢీూ 5204, తెలంగాణ సోనామసూరి, ఖచీవీ-1638, జై శ్రీరామ్, ఎమీ రకాలపై ఫోకస్ పెట్టామని వివరించారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ ఉన్న పంటలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పుకొచ్చారు. బాయిల్డ్ రైస్ కొనుగోళ్లు నిలిపివేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విధానాలతో తెలంగాణ రైతాంగం నష్టపోతోందని భట్టి విక్రమార్క విమర్శించారు. గ్రామగ్రామాన రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని రైతు కమిషన్ తెలిపింది. మేలుజాతి వంగడాలతో రైతుల ఆదాయం పెరుగుతుందని వ్యవసాయ కమిషన్ సూచించింది. రాబోయే సీజన్లలో నాణ్యమైన వరి రకాల సాగు విస్తరణ లక్ష్యమని పేర్కొంది. ఎఫ్‌సీఐ కొనుగోళ్లు తగ్గించడంతో రైతులకు ఇబ్బందిగా మారిందని వ్యవసాయ కమిషన్ అభిప్రాయపడింది.

# నియోజకవర్గం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి జూపల్లి

-మొదటి పేజీ తరువాయి: సబ్ స్టేషన్ నిర్మాణంతో గోపాల్ దీన్నే, రంగవరం గ్రామాల ప్రజలకు విద్యుత్ ఇబ్బంద్దులు ఉండవని మంత్రి గారు అన్నారు. అనంతరం ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. వీపనగండ్లలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అదనపు మౌలిక వసతుల నిర్మాణ పనులకు మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు.అనంతరం విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.భోజన నాణ్యతపై మంత్రి ఆరా తీశారు. ఏ సమస్య ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు.ప్రజాప్రభుత్వంలో సర్కారీ బడుల్లో విద్యా ప్రమాణాలు పెరిగాయని, తల్లిదండ్రులు విద్యార్థిని, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పరిస్థితి అనుకూలంగా ఉండకపోవచ్చు... వరి సాగు తగ్గించండి

-మొదటి పేజీ తరువాయి: శాస్త్రవేత్తల సలహాలతో ప్రత్యామ్నాయ పంటల వైపు అడుగులు వేయడం ప్రస్తుతానికి మంచి నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక ఎరువుల కొరత గురించి రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90.22 లక్షల బస్తాల యూరియా నిల్వలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇందులో మార్క్‌ఫెడ్ వద్ద అత్యధికంగా 59.56 లక్షల బస్తాలు ఉండగా.. రిటైల్ షాపుల్లో 22.67 లక్షలు, సహకార సంఘాల్లో 5.56 లక్షలు, గోడౌన్లలో మరో 3.56 లక్షల బస్తాల స్టాక్ అందుబాటులో ఉందని వెల్లడించారు. సకాలంలో ఎరువులు అందించేందుకు ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. టెక్నాలజీని వాడుకుంటూ రైతులు సులభంగా ఎరువులు పొందేలా ప్రభుత్వం తీసుకొచ్చిన ఫర్టిలైజర్ యాప్‌కు కూడా మంచి స్పందన వస్తోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులు దీని ద్వారా 13.22 లక్షల బస్తాలను బుక్ చేసుకోగా, అందులో 11.18 లక్షల బస్తాలు ఇప్పటికే రైతులకు చేరిపోయాయని చెప్పారు. రైతుల ఫీడ్‌బ్యాక్ ప్రకారం ఈ యాప్‌లో నిరంతరం మార్పులు చేస్తున్నామని, ఒకవేళ స్మార్ట్‌ఫోన్ లేని రైతులు ఉంటే వారి కోసం ప్రత్యేకంగా టోల్-ఫ్రీ నంబర్ ద్వారా బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని కూడా కల్పించామని వెల్లడించారు.

# తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి థ్యాంక్స్ చెప్పిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

-మొదటి పేజీ తరువాయి: ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమానిని పరామర్శించేందుకు ఆయన ఈరోజు వరంగల్ జిల్లా హనుమకొండకు వెళ్లారు. పర్యటన ముగిసిన అనంతరం, తనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ చేశారు.

**నిరంజన్ ఆకాంక్షను నెరవేర్చిన పవన్**

కొన్ని రోజుల క్రితం హనుమకొండకు చెందిన నిరంజన్ అనే యువకుడు, తాను ఓ అరుదైన వ్యాధితో పోరాడుతున్నానని, తన అభిమాన నటుడు పవన్ కల్యాణ్‌ను కలవడమే తన కోరిక అని పేర్కొంటూ ఓ వీడియో విడుదల చేశాడు. ఆ వీడియో పవన్ దృష్టికి చేరింది. దీంతో వెంటనే స్పందించిన ఆయన, అభిమాని ఆకాంక్షను నెరవేర్చాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే ఈరోజు నేరుగా హనుమకొండలోని నిరంజన్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ నిరంజన్ ప్రదర్శిస్తున్న ధైర్యం, ఆత్మవిశ్వాసం తనను ఎంతగానో కదిలించిందని పవన్ పేర్కొన్నారు. "అరుదైన వ్యాధితో చేస్తున్న పోరాటంలో నిరంజన్ అసాధారణ ధైర్యం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు ఎంతో స్ఫూర్తిదాయకం. అతని మనోధైర్యం ప్రశంసనీయం. నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని ప్రార్థించాను. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు అతనికి ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను" అని పవన్ తన పోస్టులో వివరించారు.

**తెలంగాణ ప్రభుత్వానికి, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు**

ఈ పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి, తనకు పూర్తి సహకారం అందించిన తెలంగాణ ప్రభుత్వానికి పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "నా వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసు శాఖలోని ఉన్నతాధికారుల నుంచి కానిస్టేబుల్ వరకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో తెలంగాణ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయతలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వారి అభిమానం తనకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తుందని, వారి మమకారాన్ని జీవితాంతం తన హృదయంలో నిలుపుకొంటానని పవన్ భావోద్వేగంగా రాశారు. చివరగా "ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో చూడాలని కోరుకుంటున్నాను" అంటూ అభిమానికి భరోసా ఇచ్చారు.

# తెలంగాణలో ఆగని వడగాల్పులు..

హంస కలం వార్త జూన్ 17

తెలంగాణ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ, ఎండల తీవ్రత నుంచి ప్రజలకు ఇప్పుడిప్పుడే ఉపశమనం లభించే సూచనలు కనిపించడం లేదు. జూన్ 20వ తేదీ వరకు రాష్ట్రంలోని మెజారిటీ ప్రాంతాల్లో పొడి వాతావరణమే నెలకొంటుందని, రానున్న మూడు రోజుల పాటు ఉత్తర, తూర్పు జిల్లాల్లో వడగాల్పుల వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. భారత వాతావరణ శాఖ ఐఎండీ విడుదల చేసిన తాజా నివేదికల ఆధారంగా ఈ హెచ్చరికలు జారీ అయ్యాయి. బుధవారం ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వడగాల్పులు నమోదయ్యాయి. ఈ క్రమంలో జూన్ 17, 18, 19 తేదీల్లో ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ ప్రకటించింది. గడిచిన 24 గంటల్లో సూర్యాపేట జిల్లా మోతేలో అత్యధికంగా 43.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ఖమ్మం జిల్లా ఏడుపాలెంలో 43.5 డిగ్రీలు, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్‌లో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అటు హైదరాబాద్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు హైదరాబాద్, భద్రాచలం మీదుగా ప్రయాణిస్తున్నాయి. రానున్న 4-5 రోజుల్లో ఇవి రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించడానికి సానుకూల పరిస్థితులు ఉన్నాయని అధికారులు తెలిపారు.

# పోలవరం ముంపుపై కేంద్రం కీలక లేఖ..

-మొదటి పేజీ తరువాయి: తెలంగాణ సరిహద్దు గ్రామాలను భయపెడుతున్న పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ (వెనక్కి తన్నే నీరు) ముంపు సమస్యపై ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ప్రతినిధి బృందం సమర్పించిన వినతిపత్రంపై కేంద్ర ప్రభుత్వ పరిధిలోని 'పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ' సానుకూలంగా స్పందిస్తూ రాతపూర్వక హామీ ఇచ్చింది. ఈ లేఖకు సంబంధించిన వివరాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఎక్స్ వేదికగా పంచుకున్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం కారణంగా తెలంగాణ పరిధిలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను రెండు విధాలుగా ఆదుకుంటామని అథారిటీ స్పష్టం చేసింది. ఒకటి.. తగిన ఇంజనీరింగ్ పనుల ద్వారా ఆయా గ్రామాలకు ముంపు ముప్పు లేకుండా రక్షించడం. రెండు.. అది సాధ్యం కాకపోతే పునరావాస-పునర్నిర్మాణ చట్టం కింద ఆ భూములను సేకరించి రైతులకు పక్కా నష్టపరిహారం అందించడం. 2025 ఏప్రిల్ 8న జరిగిన అంతర్రాష్ట్ర సమావేశ నిర్ణయాలకు తాము కట్టుబడి ఉన్నామని పీపీఏ తెలిపింది. గోదావరి బేసిన్ పరిధిలోని తెలంగాణ ప్రజల జీవనోపాధిని, గిరిజనుల వ్యవసాయ భూములను కాపాడటానికి శాస్త్రీయ అంచనాలు, సమగ్ర వరద నివారణ చర్యలు తీసుకుంటామని లేఖలో పునరుద్ఘాటించింది. తెలంగాణ ప్రజల ప్రాణాలకు, ప్రయోజనాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని పేర్కొంది. ఈ నేపథ్యంలో... కేంద్ర ప్రభుత్వం ముంపు ఆందోళనలను అధికారికంగా గుర్తించి, రక్షణకు హామీ ఇవ్వడాన్ని తాము స్వాగతిస్తున్నా మని హరీశ్ రావు తెలిపారు. అయితే, ఈ హామీలు కేవలం ఆఫీసు ఫైళ్లకే పరిమితం కాకుండా గ్రౌండ్ లెవెల్‌లో సకాలంలో అమలు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సరిహద్దు ప్రజల భద్రత, రైతుల ఉపాధి విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. కేంద్రం, పీపీఏ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు కలిసి సమన్వయంతో వ్యవహరి ంచి, ప్రభావితమయ్యే ప్రతి కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

# హైదరాబాద్ డెంటల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం..

-మొదటి పేజీ తరువాయి: ప్రభుత్వ డెంటల్ కాలేజీ విద్యార్థులు ప్రస్తుతం బస చేస్తున్న ఉస్మానియా మెడికల్ కాలేజీ హాస్టల్ ప్రాంగణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మొదటి సంవత్సరం బీడీఎస్ విద్యార్థులను సీనియర్లు శారీరకంగా, మానసికంగా వేధించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సంజీవ్ సింగ్ యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుల్తాన్ బజార్ పోలీసులు 12 మంది విద్యార్థులపై తెలంగాణ ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కాలేజీ యాజమాన్యం తక్షణ క్రమశిక్షణా చర్యలు చేపట్టింది. విచారణ పెండింగ్‌లో ఉండగానే, ఆరుగురు ఫైనల్ ఇయర్ విద్యార్థులను ఆరు నెలల పాటు సస్పెండ్ చేసింది. ఈ ఘటనపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో మరింత మంది విద్యార్థుల ప్రమేయం ఉందా? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. ర్యాగింగ్‌కు పాల్పడే విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకుంటామని, కాలేజీ నుంచి శాశ్వతంగా బహిష్కరించడంతో పాటు చట్టపరమైన శిక్షలు తప్పవని ప్రిన్సిపల్ హెచ్చరించారు. జూనియర్ విద్యార్థులు భయపడకుండా చదువుపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా యాంటీ-ర్యాగింగ్ కమిటీని మరింత బలోపేతం చేసినట్లు అధికారులు తెలిపారు. ర్యాగింగ్ చట్టం ప్రకారం దోషులుగా తేలితే విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుందని, వారి సర్టిఫికెట్లపై కూడా ఆ ముద్ర పడుతుందని నిపుణులు గుర్తుచేస్తున్నారు.

# సోలార్ ప్లాంట్ పెట్టండి,లాభాలు ఆర్జించండి

-మొదటి పేజీ తరువాయి: సహకార సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటే పెద్ద ఎత్తున లాభాలు ఆర్జించే అవకాశం ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. 1 మెగావాట్ సామర్థ్యంతో ఏర్పాటు చేసే ఒక్కో సోలార్ ప్లాంట్ ద్వారా ఏటా రూ.50 లక్షల ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు నాబార్డు ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. సక్రమంగా ఈఎంఐ చెల్లించే సహకార సంఘాలకు 1 శాతం వడ్డీకే రుణాలు లభిస్తాయన్నారు. బుధవారం చొప్పదండి పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ తొలుత జన ఔషధి కేంద్రాన్ని సందర్శించారు. జన ఔషధి కేంద్రానికి వస్తున్న ఆదరణపై ఆరా తీశారు. అతి తక్కువ ఖర్చుతో జన ఔషధిలో మందులు అందుబాటులో ఉన్నాయని, వినియోగించుకోవాలని ప్రజలను కోరారు.కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సహకార సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన వ్యయంలో 80 శాతానికిపైగా నాబార్డు రుణ సౌకర్యం కల్పిస్తోంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో తొలిసారి చొప్పదండి లోనే సోలార్ ప్లాంట్ ఏర్పాటు కావడం అభినందనీయం. ఈ ప్లాంట్ ధ్వారా 1 మెగావాట్ కరెంట్ ను ఉత్పత్తి చేయవచ్చు. ఒక్కో యూనిట్ ను 3 రూపాయల చొప్పున విద్యుత్ డిస్కంలు కొనుగోలు చేస్తాయి.వాస్తవానికి 1 మెగావాట్ ఉత్పత్తి కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అయ్యే మొత్తం ఖర్చు 3 కోట్ల 80 లక్షల రూపాయలు. సహకార సంఘం 40 లక్షలు వెచ్చించాలి. మిగిలిన 3 కోట్ల 40 లక్షల రూపాయలను నాబార్డ్ సంస్థ రుణం రూపంలో ఇస్తోంది. వడ్డీ 4 శాతం. ఒకవేళ సక్రమంగా ఈఎంఐ చెల్లిస్తే 3 శాతం వడ్డీని తిరిగి చెల్లిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతలో వారికే తొలి ప్రాధాన్యం

-మొదటి పేజీ తరువాయి: ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేయని గుడిసె వాసులకు మరో అవకాశం ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. రెండో విడతలో 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 2 వేల ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు నిర్మిస్తామని.. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.ప్రమాదకర ఇంటి పైకప్పుల మార్పునకు రూ. 2 లక్షల వరకు సాయం అందిస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. అసంపూర్తిగా వదిలిన ఇళ్లను కూడా ఈ పథకంలో ప్రభుత్వం చేర్చనుందన్నారు. లబ్ధిదారుడే ఇంటి నిర్మాణదారడని తెలిపారు. బీఎల్‌సీ విధానంలో నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. పట్టణాల్లో అవసరమైతే జీ+1 నిర్మాణాలకు అనుమతి ఇస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వివరించారు.

# సంపాదకీయం

## జనాభా ఆధారంగా పట్టణ విద్యా ప్రణాళిక!

హైదరాబాద్ నగరం ప్రపంచ స్థాయి ఐటీ నగరంగా ఎదిగింది. ఆకాశహర్మ్యాలు పెరిగాయి. ఫ్లైఓవర్లు విస్తరించాయి. రియల్ ఎస్టేట్ కోట్ల రూపాయల వ్యాపారంగా మారింది. కానీ మహానగరంలో ఒక మౌన సంక్షోభం నెమ్మదిగా పెరుగుతూ వచ్చింది, అదే ప్రభుత్వ విద్య క్షీణత. నగరం ఎంత వేగంగా విస్తరించిందో, ప్రభుత్వ పాఠశాలలు అంతగా విస్తరించలేదు. ఫలితంగా లక్షలాది కుటుంబాలు తమ పిల్లల విద్య కోసం ప్రైవేట్ పాఠశాలలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత పదేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ఈ నిర్లక్ష్యం ఎంత తీవ్రంగా ఉందో స్పష్టమవుతుంది. 2016లో హైదరాబాద్‌లో 684 స్థానిక సంస్థల ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 2025--26 నాటికి అవి కేవలం 691 చేరుకున్నాయి. అంటే దాదాపు పదేళ్లలో కేవలం 7 పాఠశాలలే పెరిగాయి. ఇదే సమయంలో నగర జనాభా లక్షలలో పెరిగింది. కొత్త కాలనీలు, బస్తీలు, వలస కార్మికుల నివాస ప్రాంతాలు విస్తరించాయి. కానీ ప్రభుత్వ విద్య మాత్రం అక్కడికి చేరలేదు. మూడు కార్పొరేషన్లు కలిపి ఏకంగా నగర జనాభా 1.30 కోట్లు. ఈ ఖాళీని ప్రైవేట్ విద్యాసంస్థలు వేగంగా భర్తీ చేశాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో దాదాపు 1,900కు పైగా ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 7 లక్షలకు పైగా పిల్లలు చదువుతున్నారు. నగరంలోని దాదాపు 86శాతం పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లోనే విద్యనభ్యసిస్తున్నారు. ఇది కేవలం 'తల్లిదండ్రుల ఎంపిక'గా చూడలేం. ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో లేకపోవడం, నిరంతర విద్యా వ్యవస్థ లేకపోవడం ప్రజలను ప్రైవేట్ విద్య వైపు నెట్టింది. ప్రైవేట్ పాఠశాలలు ఒక ముఖ్య విషయాన్ని అర్థం చేసుకున్నాయి. అది-- పిల్లలు ఒకసారి చేరితే పదో తరగతి వరకు అదే పాఠశాలలో చదవాలనే తల్లిదండ్రుల ఆకాంక్ష. అందుకే ఎక్కువ ప్రైవేట్ పాఠశాలలు నర్సరీ నుంచి పదో తరగతి వరకు నిరంతర విద్య అందిస్తున్నాయి. కానీ ఇప్పటికీ ఒకచోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, మరోచోట ఉన్నత ప్రాథమిక పాఠశాల ఉంటున్నాయి. పాఠశాలలు మారాల్సి రావడం వల్ల చాలామంది పిల్లలు మధ్యలోనే చదువు మానేస్తున్నారు. ఇటీవల నీతి ఆయోగ్ కూడా ప్రాథమిక స్థాయి నుంచి సెకండరీ స్థాయి వరకు ఒకే పాఠశాలలో పిల్లలు చదివే విధానం అవసరమని చెప్పింది. తెలంగాణ విద్యా కమిషన్ కూడా 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' ఆలోచనను ఇదే నేపథ్యంలో ప్రతిపాదించింది. మహానగరంలో నూతనంగా ఏర్పడిన మూడు కార్పొరేషన్లలో ఏర్పడిన 36 డివిజన్లలో క్షేత్ర స్థాయిలో సేకరించిన సమాచారం ప్రకారం, 15 లక్షల జనాభాకు కేవలం 115 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 40 ఉన్నత పాఠశాలలు మాత్రమే ఉన్నాయి. ఈ పాఠశాలల్లో కేవలం 25 వేల మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. పట్టణ జనాభాలో సరాసరి 13.7శాతం 6 నుంచి 14 సంవత్సరాల బాలలు ఉంటారని ఈ మధ్య జరిగిన కుల గణన సర్వే తెలిపింది. అంటే ఈ 36 డివిజన్లలో 15 లక్షల జనాభాకు 2 లక్షల మంది బడికెళ్లే వయసు బాలలు ఉంటే, కేవలం 25 (12శాతం) వేల మందికి మాత్రమే సరిపడ ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అవి కూడా అరకొర వసతులతో నడుస్తున్నాయి. కుల గణన సర్వే ప్రకారం పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్న అధిక శాతం దినసరి కూలీలుగా, నైపుణ్యం లేని కూలీలుగా, వీధులలో చిన్న వ్యాపారాలు చేస్తూ అతి తక్కువ ఆదాయాలతో జీవనం కొనసాగిస్తున్నారు. జనాభాలో 78.2శాతం మంది సంవత్సరానికి కేవలం రూ.లక్ష కంటే తక్కువ సంపాదించేవారు ఉన్నారని ఈ సర్వేను పరిశీలించిన స్వతంత్ర నిపుణుల బృందం విశ్లేషణ ద్వారా తెలుస్తోంది. ఈ కుటుంబాలన్నీ తీవ్ర వెనుకబాటులో ఉన్న కులాలే అని విశ్లేషించింది. ఈ కుటుంబాల మీద ప్రైవేటు విద్య భారం ఎంత పడుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇది కేవలం హైదరాబాద్ సమస్య మాత్రమే కాదు. గ్రామీణ సంక్షోభం, వ్యవసాయ అస్థిరత, ఉపాధి కొరత, జీవన అవకాశాల లోపం వల్ల లక్షలాది కుటుంబాలు నగరాలకు వలస వస్తున్నాయి. కేవలం ఉపాధి కోసమే కాకుండా తమ పిల్లలకు మెరుగైన విద్య లభించాలనే ఆశ వల్ల కూడా ఈ వలసలు జరుగుతున్నాయి. గ్రామాల్లో నాణ్యమైన పాఠశాలలు లేకపోవడం, ఉన్నత విద్య అందుబాటులో లేకపోవడంతోపాటు, ఇంగ్లీష్ మీడియం, నిరంతర విద్య కోసం తల్లిదండ్రులు నగరాలను ఆశ్రయిస్తున్నారు. కానీ విద్యాశాఖ ఇప్పటికీ గ్రామీణ నమూనాలతోనే పట్టణ విద్యను ప్రణాళిక చేస్తోంది. 'ఒక కిలోమీటర్ పరిధిలో ఒక ప్రాథమిక పాఠశాల' అనే పాత ప్రమాణం పట్టణ ప్రాంతాలకు సరిపోదు. నగరాల్లో జనసాంద్రత చాలా ఎక్కువ. ఉదాహరణకు హైదరాబాద్‌లో ప్రతి చదరపు కిలోమీటర్‌కు సుమారు 15 వేల మంది జనాభా నివసిస్తున్నారు. ఇంత భారీ జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో కేవలం దూర ప్రమాణాలతో పాఠశాలల ప్రణాళిక చేయడం వాస్తవ పరిస్థితులకు అనుగుణం కాదు. పట్టణ విద్యా ప్రణాళిక జనాభా ఆధారంగా ఉండాలి. మన ప్రభుత్వాలు ఇప్పటికే అనేక సేవలను జనాభా ప్రాతిపదికన ప్రణాళిక చేస్తున్నాయి. మద్యం దుకాణాలు, పోలింగ్ బూత్‌లు, ఆరోగ్య సేవలు కూడా జనాభా ఆధారంగానే ఏర్పాటు అవుతున్నాయి. అయితే విద్య విషయంలో మాత్రం ఇప్పటికీ పాత ప్రమాణాలనే కొనసాగిస్తున్నారు. ఇది అత్యంత ఆందోళనకర విషయం. పట్టణ అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, మెట్రోలు, ఐటీ టవర్లు కాదు. విద్య కూడా పట్టణ మౌలిక సదుపాయాలలో భాగం కావాలి. ప్రతి కొత్త కాలనీ, పెద్ద హౌసింగ్ ప్రాజెక్ట్, విస్తరిస్తున్న నగర ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలల కోసం భూమిని తప్పనిసరిగా కేటాయించాలి. ఇవి ఎవరి దయాదాక్షిణ్యాలతోనో అందుకునే సేవలు కావు. ఇది పిల్లల రాజ్యాంగ హక్కు. ప్రభుత్వ విద్యను సంక్షేమ కార్యక్రమంలా కాకుండా, పట్టణ ప్రణాళిక, సామాజిక న్యాయ కార్యక్రమంగా చూడాలి. హైదరాబాద్ మహానగరం ఫ్యూచర్ సిటీ, క్యూర్ రీజియన్ భవిష్యత్తు గురించి నిజంగా ఆలోచిస్తే, ప్రభుత్వ విద్య పునర్నిర్మాణం తప్పనిసరి. లేదంటే విద్య పూర్తిగా మార్కెట్ ఆధారిత వ్యవస్థగా మారి, పేద, మధ్యతరగతి కుటుంబాలపై మరింత ఆర్థిక భారాన్ని మోపుతుంది. కొంతమందిని వెలివేస్తుంది. సమాన అవకాశాల సమాజం నిర్మించాలంటే బలమైన ప్రభుత్వ విద్యా వ్యవస్థే పునాది. కాబట్టి కాలయాపన చేయకుండా విద్యానిపుణులతో తెలంగాణ విద్యా కమిషన్ సిఫారసులను పరిశీలించి తక్షణమే పట్టణ విద్యా ప్రణాళికలు తయారు చేయాలి.

# ప్రజాస్వామ్య ప్రహసనంలో మీనాక్షి అంకం





ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేసిన ఒక అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించాల్సిందిగా రాయలసీమకు చెందిన కొందరు నేతలు నాడు శాసనసభ సెక్రటరీగా ఉన్న సత్యనారాయణరావు అనే రిటర్నింగ్ అధికారిపై తీవ్ర ఒత్తిడి చేశారు, ప్రలోభపెట్టారు. ఆ రిటర్నింగ్ అధికారి భయ భ్రాంతుడై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సంప్రదించారు. 'మీరే ఒత్తిళ్లకూ లొంగవద్దు. నిబంధనల ప్రకారం నిర్భయంగా వ్యవహరించండి' అని ఆయన ఆ అధికారికి చెప్పినట్లు సమాచారం. 2009లో వైఎస్ జమానాలో కనిగిరి నుంచి శాసనసభకు పోటీ చేసిన తెలుగుదేశం అభ్యర్థి కదిరి బాబూరావు తన అఫిడవిట్‌లో ఒకచోట సంతకం చేయడం మరిచిపోయారు. సాయంత్రం 5 గంటల వరకు ఏమీ చెప్పకుండా వ్యూహాత్మక మౌనం పాటించిన రిటర్నింగ్ అధికారి ఆ తర్వాత సంతకం లేదన్న కారణంతో బాబూరావు నామినేషన్ పత్రాలను తిరస్కరించారు. ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణకు సన్నిహితుడుగా బాబూరావు పేరు పొందారు. అభ్యర్థుల తలరాతను నిర్ణయించడంలో రిటర్నింగ్ అధికారులు ఎంత కీలకపాత్ర పోషిస్తారో చెప్పేందుకు ఇవి ఉదాహరణలు మాత్రమే. కురుక్షేత్ర సంగ్రామంలో ఒక్క రోజైనా పాండవులను ప్రవేశించకుండా అడ్డుకోగలిగిన శక్తి సైంధవుడికి ఉన్నట్లే, ఎన్నికల యుద్ధంలో రిటర్నింగ్ అధికారులు కూడా అప్పుడప్పుడు సైంధవ పాత్ర పోషిస్తారు. వారి శక్తి అంత బలమైనది. ఇటీవల మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి, పార్టీ ప్రధాన కార్యదర్శి మీనాక్షి నటరాజన్ నామినేషన్ పత్రాలను తిరస్కరించడంలో అరవింద్ శర్మ అనే రిటర్నింగ్ అధికారి కీలక పాత్ర పోషించారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న అరవింద్ శర్మ అంతకు ముందు లోక్‌సభలో డైరెక్టర్‌గా ఉండేవారు. సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమిస్తున్న కాలంలో వ్యవసాయ మంత్రిగా ఉన్న నరేంద్రసింగ్ తోమర్ సహాయంతో అరవింద్ శర్మ మధ్యప్రదేశ్‌కు వచ్చారంటే ఆయనకు బీజేపీతో ఉన్న బలమైన సంబంధాలు ఊహించుకోవాల్సిందే. తోమర్ ఇప్పుడు మధ్యప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా ఉన్నారు. బహుశా మీనాక్షి నటరాజన్‌కు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో ఒక ఫిర్యాదు దాఖలైందన్న విషయం బీజేపీ వర్గాలకు నోటిఫికేషన్ రాకముందే తెలిసి ఉండాలి. లేకపోతే తమకు బలం లేకపోయినా మూడో అభ్యర్థిని రంగంలోకి దించేవారు కాదు. మీనాక్షి నామినేషన్ దాఖలు చేయడం, బీజేపీ వెంటనే ఆమెపై ఉన్న కేసును రిటర్నింగ్ అధికారికి గుర్తు చేయడం, ఆయన వెంటనే ఆమె నామినేషన్‌ను తిరస్కరించి, బీజేపీ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రకటించడం అంతా ఆగమేఘాలపై జరిగిపోయింది. బీజేపీ ఏమి చేసినా అంతా పకడ్బందీగా, ఎంతో ముందుగా ప్లాన్ చేస్తుందని అర్థమవుతోంది. గత ఏప్రిల్‌లో మూడు రోజుల పాటు పార్లమెంటులో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసినప్పటికీ మోదీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ఆమోదించుకోలేకపోయింది. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలా ప్రతిపక్షాలు బిల్లులు వీగిపోయేలా చేయడం ఇది మొదటిసారి. పశ్చిమబెంగాల్‌లో తొలిసారి బీజేపీ అఖండ మెజారిటీతో విజయం సాధించడంతో ఆ పార్టీకి ఆత్మవిశ్వాసం పెరిగింది. పార్లమెంట్ ఉభయ సభల్లో అత్యధిక సంఖ్యాబలాన్ని పెంచుకునేందుకు అన్ని రకాల పద్ధతులు ఉపయోగించాలనుకున్నారు. అందులో భాగంగా 20 మంది లోక్‌సభ సభ్యులు తృణమూల్ ఎంపీలు పార్టీ నుంచి విడివడి 'నేషనలిస్టు సిటిజన్స్ పార్టీ' అనే ఒక అనామక పార్టీలో చేరి ఎన్డీఏకు మద్దతు ప్రకటించారు. రాజ్యసభలో ఆ పార్టీకి చెందిన ముగ్గురు సభ్యులు రాజీనామా చేశారు. మరికొందరితో బేరసారాలు జరుగుతున్నాయి. నిన్నమొన్నటి వరకు బెంగాల్ ఎన్నికల్లో మోదీని దూషించిన నేతలే ఇప్పుడు ఆయనే తమ నాయకుడని భావిస్తున్నారు. జార్ఖండ్‌లో అంబానీ కుడిభుజం పరిమళ్ నత్వానీతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయించి అధికార పార్టీ ఎమ్మెల్యేలను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను వ్యూహాత్మకంగా తిరస్కరించేలా చేయడంతో మధ్యప్రదేశ్‌కు చెందిన ముగ్గురు బీజేపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చూశారు. అంతే కాదు, దేశ వ్యాప్తంగా 19 మంది బీజేపీ ఎంపీలు ఎలాంటి పోటీ లేకుండా విజయం సాధించారు. ఈ పరిణామాలతో ఉభయ సభల్లో తమకు తిరుగులేకుండా చేసుకుని తాము అనుకున్న బిల్లులను ఆమోదించేందుకు మోదీ సర్కార్ రంగం సిద్ధం చేస్తోందన్న విషయం స్పష్టమవుతోంది. ఉభయ సభల్లో రెండింట మూడో వంతు మెజారిటీకి ఇంకా ఎన్డీఏ చేరువలోకి రాకపోయినప్పటికీ జూలైలో వర్షాకాల సమావేశాలు సమీపించే నాటికి బీజేపీ ఇంకెంతమందిని తమవైపు తిప్పుకుంటుందో అన్న అంశంపై దేశ రాజధానిలో చర్చ జరుగుతోంది. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కృతి, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు ఎన్డీఏకు దాసోహం అయిన తర్వాత దేశవ్యాప్తంగా ప్రతి పార్టీలోనూ తమ మనుగడకు సంబంధించి ఒక రకమైన గుబులు బయలుదేరింది. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన, పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ కూడా అస్తిత్వ పరీక్షలో పడ్డాయని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాకాల సమావేశాల్లో మోదీ ప్రభుత్వం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులతో సహా అనేక కీలక బిల్లులను ఆమోదింపజేసేందుకు రంగం సిద్ధం చేసిందని స్పష్టమవుతోంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే గతంలో రిటర్నింగ్ అధికారులు వివాదాస్పదంగా ప్రవర్తించినప్పటికీ మీనాక్షి నటరాజన్‌కు లభించినంత సానుభూతి ఎవరికీ లభించలేదు. ఆమె గాంధేయవాదిగా చాలా సాధారణ జీవితం సాగించే అరుదైన నాయకురాలు కావడం అందుకు కారణం కావచ్చు. ఇక్కడ రిటర్నింగ్ అధికారిని విమర్శించి లాభం లేదు. 'మేము ఏమి చేయగలం. పైనుంచి ఆదేశాలు వస్తే?' అని మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక అధికారి అన్నారు. ఆమెకు ఏ మాత్రం సంబంధం లేని ఒక ప్రైవేటు ఫిర్యాదు ఆధారంగా దాఖలైన కేసును సాకుగా తీసుకుని ఆమె నామినేషన్‌ను తిరస్కరించడం పూర్తిగా అసంబద్ధంగా కనపడుతోంది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 33(ఏ) ప్రకారం చార్జిషీటు దాఖలై, ఆరోపణలు నిర్ధారించిన తర్వాత రెండేళ్ల కంటే జైలు శిక్షపడదగ్గ కేసులనే వెల్లడించాల్సి ఉంటుందని చట్టసభల్లో రిటర్నింగ్ అధికారులుగా పనిచేసిన అనేక మంది అంటున్నారు. ఒకవేళ అఫిడవిట్‌ను పూర్తిగా నింపలేదని రిటర్నింగ్ అధికారి అనుకున్నప్పటికీ కేవలం అదే కారణంతో నామినేషన్‌ను తిరస్కరించకూడదని, అభ్యర్థికి తన తప్పు సరిదిద్దుకునేందుకు మరో అవకాశం కల్పించాలని వారు చెబుతున్నారు. మధ్యప్రదేశ్‌లో మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించిన రోజే జార్ఖండ్‌లో బీజేపీ అభ్యర్థికి తన అఫిడవిట్‌లో తప్పు సరిదిద్దుకోవడానికి 24 గంటల సమయం ఇచ్చారు. దేశవ్యాప్తంగా రిటర్నింగ్ అధికారులు ఇలా న్యాయబద్ధంగా వ్యవహరించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఒక అభ్యర్థి ప్రజాస్వామికంగా ఎన్నికయ్యేందుకు అధికారులు వీలు కల్పించాలి కానీ ఆ అభ్యర్థి ఎన్నిక కాకుండా అవరోధం కల్పించడం, అధికార పార్టీ రాజకీయాలకు అనుగుణంగా అధికారులు వ్యవహరించడం జరిగినప్పుడు మన దేశంలో ప్రజాస్వామ్యం ఆరోగ్యకరంగా లేదన్న విషయం స్పష్టమవుతున్నది. తన నామినేషన్‌ను అన్యాయంగా తిరస్కరించారని మీనాక్షి నటరాజన్ సుప్రీంకోర్టుకు వెళ్లినప్పుడు ఆ విషయంలో జోక్యం చేసుకునేందుకు కోర్టు నిరాకరించింది. ఆర్టికల్ 329(బి) కింద చట్టసభకు జరిగిన ఏ ఎన్నికనూ సవాల్ చేయడానికి వీలు లేదని సుప్రీంకోర్టు తేల్చింది. కావాలంటే హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని కోర్టు స్పష్టం చేసింది. న్యాయస్థానాల్లో ఎన్నికల పిటిషన్‌ల పరిస్థితి ఎంత దారుణంగా ఉన్నదో సుప్రీంకోర్టుకు కూడా తెలుసు. ఇప్పటి వరకు ఉన్న అనుభవం రీత్యా మీనాక్షి నటరాజన్ పిటిషన్‌పై తేలాలంటే ఎన్ని సంవత్సరాలు పడుతుందో ఎవరికీ తెలియదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఒకరు చెప్పారు. కోర్టులు ఎన్నికల పిటిషన్లపై ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటు చేసి ఆరు నెలలలోపు నిర్ణయాలు ప్రకటించాలని 2019లో అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా ఒక ప్రసంగంలో అన్నారు. అటు సుప్రీంకోర్టూ తేల్చక, ఇటు ఎన్నికల పిటిషన్లపై వేగంగా తీర్పురాని పరిస్థితుల్లో నలిగిపోతున్న ప్రజాస్వామ్యాన్ని ఎవరు రక్షించాలి? పైగా దేశంలో ఇప్పుడున్న పరిస్థితుల్లో న్యాయస్థానాలు అనుసరిస్తున్న వైఖరి విచిత్రంగా ఉంటోంది. ప్రజాసమస్యలపై కేసులు దాఖలు చేస్తున్న వారిని బొద్దింకలని, పనిపాట లేని వారని, అభివృద్ధి నిరోధకులని న్యాయస్థానాలే తీర్మానించే పరిస్థితి ఏర్పడుతోంది. 'కేంద్రం డబ్బులు ఖర్చుపెట్టి రోడ్లు నిర్మిస్తోంది. సమాచార చట్టం కింద రోడ్ల పురోగతిని ప్రశ్నించడానికి నీవెవరివి, ఇది ఎల్లో జర్నలిజం' అని సుప్రీంకోర్టు మంగళవారం ఒక ఆర్టీఐ కార్యకర్తను విమర్శించి కేసు కొట్టేసింది. చట్టసభల్లో మెజారిటీ సాధించేందుకు, తాము అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు అధికార పార్టీ ప్రయత్నించడం రాజనీతి అని కొందరు, కుటిలనీతి అని మరికొందరు అంటారు. ఏ నీతి అయినా అనుసరిస్తున్న మార్గాలు, విఫలమవుతున్న వ్యవస్థలను ప్రశ్నించడం కూడా తప్పు కాదు.

# మందమర్రి ప్రెస్ క్లబ్‌కు కొత్త సారథి..

**-ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా చందర్ ఘన విజయం..**
**-రహస్య బ్యాలెట్‌లో సభ్యుల భారీ భాగస్వామ్యం..**
**-ప్రధాన కార్యదర్శిగా సలాముద్దీన్ ఎన్నిక..**
**-జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యమన్న నూతన కార్యవర్గం..**

హంస కలం వార్త జూన్ 17 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్



మందమర్రి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఉత్కంఠభరితంగా, ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబించేలా బుధవారం విజయవంతంగా నిర్వహించబడ్డాయి. స్థానిక జర్నలిస్టుల భవిష్యత్ కార్యాచరణ, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి దిశానిర్దేశం చేసే ఈ ఎన్నికలపై సభ్యుల్లో ప్రారంభం నుంచే ఆసక్తి నెలకొంది. హడాక్ కమిటీ ఆధ్వర్యంలో రహస్య బ్యాలెట్ విధానంలో నిర్వహించిన ఎన్నికల్లో సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవికి జరిగిన పోటీలో గజ్జల చందర్ స్పష్టమైన మెజార్టీతో విజయం సాధించి ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎండి సలాముద్దీన్, కోశాధికారిగా సకినాల శంకర్ ఎన్నికయ్యారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించగానే ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. నూతన కార్యవర్గ సభ్యులను జర్నలిస్టులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంత వాతావరణంలో సాగింది. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించిన హడాక్ కమిటీ పనితీరును సభ్యులు ప్రశంసించారు. సభ్యులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ ఎన్నికల నిర్వహణలో కమిటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గజ్జల చందర్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి గెలిపించిన ప్రతి సభ్యునికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధి, జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేస్తానన్నారు. సభ్యుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేసి ప్రెస్ క్లబ్‌ను జిల్లాలో ఆదర్శ సంస్థగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాలు, శిక్షణా సదస్సులు, అత్యవసర సహాయ చర్యలు, సంస్థాగత అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని నూతన కార్యవర్గం వెల్లడించింది. సభ్యుల సూచనలు, సలహాలను స్వీకరిస్తూ అందరి భాగస్వామ్యంతో ముందుకు సాగుతామని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు, హడాక్ కమిటీ ప్రతినిధులు పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా అభినందించారు.

# విద్యాలయాలా..?..వసూళ్ల అడ్డాలా.?

**-విద్య పేరుతో వ్యాపారం..**
**-పుస్తకాలపై భారీ దోపిడీ..**
**-తల్లిదండ్రులపై ఆర్థిక భారం..**
**-చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాలు డిమాండ్..**

హంస కలం వార్త జూన్ 16 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్



విద్యను సేవగా కాకుండా లాభాల వ్యాపారంగా మార్చుకుంటున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల వ్యవహారంపై మందమర్రిలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తును సాకుగా చూపుతూ పాఠశాల యాజమాన్యాలు తల్లిదండ్రులపై ఆర్థిక భారాలు మోపుతున్నాయని, నిబంధనలను పక్కనపెట్టి పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, బూట్లు, స్టేషనరీ సామగ్రి విక్రయిస్తూ విద్యా వ్యవస్థను వ్యాపార కేంద్రంగా మార్చేశాయని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండగా, కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే వేల రూపాయల అదనపు భారం మోపడం దారుణమని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో మందమర్రి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఫిర్యాదు సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మండల కేంద్రంలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ధరల కంటే అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, బూట్లు, ఇతర విద్యా సామగ్రిని విక్రయిస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థులు తప్పనిసరిగా పాఠశాల సూచించిన చోటే కొనుగోలు చేయాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని తెలిపారు. పాఠ్యపుస్తకాలను పాఠశాల ప్రాంగణంలో లేదా ఒక నిర్దిష్ట దుకాణంలో మాత్రమే విక్రయించడం చట్టవిరుద్ధమని నిబంధనలు స్పష్టంగా చెబుతున్నప్పటికీ, కొన్ని యాజమాన్యాలు వాటిని పట్టించుకోవడం లేదన్నారు. ఈ అక్రమాలను ప్రశ్నించిన తల్లిదండ్రులను బెదిరిస్తూ, పిల్లలకు బదిలీ ధ్రువపత్రాలు తీసుకుని వెళ్లాలని ఒత్తిడి చేస్తున్న ఘటనలు కూడా వెలుగుచూస్తున్నాయని ఆరోపించారు. విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రుల బలహీనతలను ఆసరాగా చేసుకుని జరుగుతున్న ఈ దోపిడీపై విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కోరారు.

# కేపిహెచ్బి పోలీసుల వేగవంతమైన చర్యతో ఏటీఎం మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల అరెస్టు

( జూన్ – 17– హంస కలంవార్త )

కేపిహెచ్బి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏటీఎం కేంద్రాలలో కస్టమర్ల దృష్టి మరల్చి మోసపూరితంగా నగదు అపహరించిన ఇద్దరు నిందితులను కేపిహెచ్బి క్రైమ్ టీం అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా, వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించడం జరిగింది.

**-అరెస్టు చేసిన నిందితులు:**

1. వడ్డే కాటమయ్య (25 సంవత్సరాలు), నివాసం: టిఎల్ఆర్ డీలక్స్ మెన్స్ పీజీ హాస్టల్, కేపిహెచ్బి, హైదరాబాద్. స్వస్థలం: అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్. పూర్వపు నేరం: జతీ. No. 26/2026 U/S 318(4), 305 BNS.of Miyapur PS 2. పల్లపు శ్రీనివాస్ (48 సంవత్సరాలు), నివాసం: ఎల్ఐజీ–78, 7వ ఫేజ్, కేపిహెచ్బి కాలనీ, హైదరాబాద్. స్వస్థలం: కాకినాడ, ఆంధ్రప్రదేశ్. పూర్వపు నేరాలు: జతీ. No. 930/2021 U/S 3, 4, 5 & 6 PITA Act, 1956. Of Bachupally PS
జతీ. No. 1173/2025 U/S 143, 144(2) BNS & Sections 3, 4, 5 & 6 PITA Act, 1956. Of Jagadgirigutta PS.

**-నేరం చేసే విధానం:**

జల్సాలకు అలవాటు పడ్డ ఈ ఇద్దరు నిందితులకు సంగారెడ్డి జైలులో పరిచయం ఏర్పడింది. అనంతరం వారు కలిసి ఏటీఎం కేంద్రాలలో మోసాలకు పాల్పడటం ప్రారంభించారు. పల్లపు శీను ఏటీఎం బయట కాపు కాస్తాడు వడ్డే కాటమయ్య ఏటీఎం సెంటర్లోకి వెళ్లి యంత్రంలోని నగదు బయటకు వచ్చే భాగం వద్ద పారదర్శక ప్లాస్టిక్ షీట్‌ను అమర్చేవాడు. దీంతో కస్టమర్ నగదు ఉపసంహరించుకునే సమయంలో నగదు బయటకు రాకుండా అడ్డుపడేది. అయితే కస్టమర్ ఖాతా నుండి డబ్బు డెబిట్ అయినట్లు మెసేజ్ రావడంతో, ఏటీఎం లోపం కారణంగా నగదు రాలేదని భావించి ఏటీఎం సెంటర్ నుంచి వెళ్లిపోతాడు. ఆ తర్వాత అది గమనించి కాటయ్య లోపలికి వెళ్లి ఆ సీటును తొలగించి ఆ డబ్బులను మిషన్లో నుంచి బయటికి తీసుకుని అక్కడి నుంచి ఇద్దరు పరారవుతారు, బాధితులు తర్వాత బ్యాంకును సంప్రదించేవారు. అనంతరం బ్యాంకులు పరిశీలించి సంబంధిత మొత్తాన్ని తిరిగి కస్టమర్ల ఖాతాల్లో జమ చేస్తుంది. ఇలా మోసం చేసేవారు. ఈ నెల 7వ తేదీన కేపిహెచ్బి 9వ ఫేజ్‌లోని యూనియన్ బ్యాంక్ ఏటీఎంలో ఇదే తరహా ఘటన చోటుచేసుకుంది. బాధితుడు రూ. 5000/– డ్రా చేయగా ఏటీఎం మెషిన్ నుంచి డబ్బు బయటికి రాలేదు, బాధితుడు బ్యాంకును సంప్రదించగా, బ్యాంకు అధికారులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి ఇద్దరు వ్యక్తులు కలిసి మోసపూరిత చర్యలకు పాల్పడినట్లు గుర్తించి కేపిహెచ్బి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన 24 గంటల వ్యవధిలోనే కేపిహెచ్బి క్రైమ్ టీం వేగంగా స్పందించి సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీల సహాయంతో నిందితులను గుర్తించి అరెస్టు చేసింది. ఈ సందర్భంగా ACP KPHB.Ravikiran Reddy మాట్లాడుతూ, ప్రజలు ఏటీఎం కేంద్రాలలో నగదు ఉపసంహరణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, నగదు రాకపోయిన సందర్భంలో వెంటనే బ్యాంకు అధికారులకు మరియు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏటీఎంలలో అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.




## ఆన్లైన్ బుకింగ్ యాప్ ద్వారా నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా యూరియా విక్రయాలు




హంస కలం వార్త జూన్ 17

పారదర్శకంగా ఎరువుల పంపిణీ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా నిజామాబాద్ జిల్లా రైతులు రాష్ట్రంలోనే అత్యధికంగా యూరియా కొనుగోలు చేయడం జరిగిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. జిల్లాలో పూర్తిగా ఆన్లైన్ బుకింగ్ యాప్ ద్వారానే యూరియా విక్రయాలు జరుగుతున్నాయని అన్నారు. ఫలితంగా ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రణాళికాబద్ధంగా యూరియా పంపిణీ జరుగుతోందని తెలిపారు. ఖరీఫ్ సీజన్ లో జిల్లాలో పంటల సాగు కోసం 80,857 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం అవుతుందని అంచనా వేయగా, జిల్లాకు 38,766 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు వచ్చాయని వివరించారు. ఇందులో ఇప్పటివరకు రాష్ట్రంలోనే అత్యధిక పరిమాణంలో 21,071 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులు కొనుగోలు చేశారని అన్నారు. ఆన్లైన్ బుకింగ్ యాప్ ద్వారా 1,46,393 మంది రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా కొనుగోలు చేయడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు. గత సంవత్సరం ఇదే సమయానికి 13,995 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే అమ్మకం జరిగిందని, ప్రస్తుతం 21,071 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించామని అన్నారు. జిల్లాలో ఇంకనూ 17,695 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా కోరిన మేరకు యూరియా నిల్వలను ప్రభుత్వం జిల్లాకు కేటాయిస్తున్నందున రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని కలెక్టర్ సూచించారు. సొసైటీలు, వివిధ సంస్థలు, ప్రైవేట్ డీలర్లతో పాటు జిల్లాలోని 106 రైతు వేదికల ద్వారా కూడా ఎరువుల విక్రయాలు జరిగేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. ఆన్లైన్ బుకింగ్ యాప్ ద్వారా జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాలలోని ఏ డీలర్ వద్ద, ఏ సొసైటీలో ఎంత పరిమాణంలో యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయనే సమాచారం తెలుసుకోగలుతున్నారని అన్నారు. రైతులు సమీప డీలర్ల వద్ద, సొసైటీల సేల్ పాయింట్ల నుండి సాగు చేస్తున్న పంట విస్తీర్ణానికి అవసరమైన యూరియా ను ముందుగా బుక్ చేసుకుని, 24 గంటల లోపు బుకింగ్ ఐడి ఆధారంగా యూరియాను కొనుగోలు చేసుకుంటున్నారని కలెక్టర్ వివరించారు. ఆధార్ ధ్రువీకరణ తో పాటు భూమి యజమాని వివరాలు నమోదు చేసి కౌలు రైతులు కూడా యూరియా బుక్ చేసుకోవచ్చని సూచించారు. పట్టా పాస్ బుక్ లేని రైతులు తమ ఆధీనంలో ఉన్న సాగు భూమి వివరాలను మండల వ్యవసాయ అధికారికి సమర్పించి యూరియా బుక్ చేసుకోవచ్చని అన్నారు. తొలి విడతగా యూరియా కొనుగోలు చేసిన రైతులు తిరిగి పక్షం రోజుల తరువాత మళ్లీ బుక్ చేసుకునే వెసులుబాటు ఉందని సూచించారు. జిల్లాలో ఈ యాప్ ద్వారా పక్కాగా, పూర్తి పారదర్శకముగ యూరియా పంపిణీ జరుగుతోందని తెలిపారు.

## కాంగ్రెస్ లో చేరిన కమలం కార్యకర్తలు

**-అధికారం కోసమే బీజేపీ మత రాజకీయాలు**
**-మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**

హంస కలం వార్త జూన్ 17



మానకొండూర్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన సుమారు 40 మంది బీజేపీ కార్యకర్తలు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ లో చేరిన ప్రముఖుల్లో పిట్టల కృష్ణ, శీలం సంతోష్, అడప సాగర్, జెట్టి శంకర్, గాలిపెల్లి గణేష్, పిట్టల రాజు, గంధం కనకరాజు, ముత్యం అజయ్, శీలం సతీష్, తాళ్ల సాయి, పవన్, లక్ష్మినారాయణ గుర్రాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం పారదర్శకంగా పాలన సాగిస్తోందని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొడుతన్నదని, అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కమలనాథులు ఎప్పటికప్పుడు మత రాజకీయాలను ప్రోత్సహిస్తుంటారని ఆరోపించారు. దేశ ప్రజలు ఇప్పుడు బీజేపీ తీరును పూర్తిగా అర్థం చేసుకున్నారని, అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీనే ప్రత్యామ్నాయంగా భావిస్తున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా మరింత బలోపేతమవుతోందని, తెలంగాణలో కూడా పార్టీకి రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. పార్టీలో చేరిన కార్యకర్తలకు కాంగ్రెస్‌లో తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఉంటుందని డాక్టర్ కవ్వంపల్లి హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతానికి కృషి చేసి ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, లింగాపూర్ గ్రామశాఖ పార్టీ అధ్యక్షుడు తాళ్ల సంపత్, ఉప సర్పంచ్ వెంకటేశ్, పార్టీ నాయకులు రాజయ్య,భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలి

-అధికారులు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

-రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డా.జి.చంద్రశేఖర్ రెడ్డి



హంసకలం వార్త జూన్17

సమాచార హక్కు చట్టాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని,ప్రభుత్వ శాఖలు అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డా. జి.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో రాష్ట్ర సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు, మొహ్సినా పర్వీన్, దేశాల భూపాల్,బోరెడ్డి అయోధ్యరెడ్డి,జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డిసిపి ఎ.భాస్కర్,జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)వి.రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి జిల్లా అధికారులకు సమాచార హక్కు చట్టం-2005 (ఆర్ టీ ఐ యక్ట్ -2005) సమర్థవంతమైన అమలు, ప్రజలకు సమాచారాన్ని సకాలంలో అందించడం, చట్టంలోని నిబంధనలను ఖచ్చితంగా పాటించడం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ మాట్లాడుతూ...ప్రజలకు సమాచారాన్ని పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందించడం ప్రతి ప్రభుత్వ అధికారి బాధ్యత అని,సమాచార హక్కు చట్టం లక్ష్యాలను సాధించేందుకు అధికారులు చట్ట నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించే శక్తివంతమైన సాధనమని, చట్టం ప్రకారం 30 రోజులలోపు సమాచారం ఇవ్వాలని, గడువు దాటితే సమాచారాన్ని ఉచితంగా అందించాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లాలోని అన్ని శాఖల ప్రథమ అప్పీళ్ల అధికారులకు,ప్రజా సమాచార అధికారులకు (పి ఐ ఎస్ ఓ ఎస్), సహాయ ప్రజా సమాచార అధి కారులకు (APIOs) సమాచార హక్కు చట్టం-2005 లోని ముఖ్యమైన నిబంధనలు, దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించిన కాలపరిమితులు, అప్పీళ్ల నిర్వహణ, సమాచారాన్ని అందించడంలో పాటించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. ప్రతి అధికారి సమాచార హక్కు చట్టంలోని అన్ని నిబంధనలను పూర్తిగా తెలుసుకోవాలని, అందిన ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించాలని, సమాచార హక్కు చట్టాన్ని ఎప్పటికీ నిర్లక్ష్యం చేయరాదని, అత్యున్నత ప్రాధాన్యతతో అమలు చేయాలని తెలిపారు. కమిషన్ ముందు అప్పీళ్ళ పరిష్కార సమయంలో ప్రజా సమాచార అధికారులు (|¾×zmdt) తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ అందించిన సలహాలు,సూచనలు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. సమాచార హక్కు చట్టం అమలులో మరింత సమర్థవంతంగా పని చేసి ప్రజలకు సత్వర సేవలు అందించాలని అధికారులకు సూచించారు.అనంతరం జిల్లాలోని పెండింగ్ లో ఉన్న అప్పీళ్ళ దరఖాస్తులను ప్రభుత్వ శాఖల వారీగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు,జిల్లా అధికారులు,వివిధ శాఖల ప్రజా సమాచార అధికారులు, మొదటి అప్పీలేట్ అథారిటీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిర్దేశిత సమయంలో టిజి ఐపాస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ పూర్తి చేయాలి .... జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

-టిజి ఐ-పాస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించిన జిల్లా కలెక్టర్..



హంసకలం వార్త జూన్17

జిల్లాలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించేందుకు టిజి-ఐపాస్ క్రింద వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధికారులతో టిజి-ఐ-పాస్ కమిటీ సమావేశం నిర్వహించి పరిశ్రమల స్థాపన, టిజి ఐపాస్ అనుమతులు, టి - ప్రైడ్ పై పథకం అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో టీజి ఐపాస్ విధానం అమలవుతున్న తీరును ఆరా తీశారు. జిల్లాలో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను సకాలంలో జారీ చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు సంబంధించి వివిధ శాఖల అనుమతులకు వేచియున్న ప్రతిపాదనల సమస్యలపై సమీక్షించారు. పెండింగ్ లో ఉన్న ప్రతిపాదనలు సైతం తక్షణమే సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో టీ - ప్రైడ్ పథకం క్రింద నూతనంగా ఏర్పాటు చేసిన 12 ఎస్సీ, 13ఎస్టీ యూనిట్లకు ఒక కోటి 35 లక్షల 31 వేల 146 రూపాయల పెట్టుబడి సబ్సిడీని మంజూరు చేయడం జరిగిందన్నారు. పావలా వడ్డీ క్రింద ఒక ఎస్టీ యూనిట్ కు 46 వేల 374 రూపాయల సబ్సిడీ అందించామన్నారు. పరిశ్రమల శాఖ సంక్షేమ శాఖల సమన్వయంతో పథకాలు అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జి.ఎం. పరిశ్రమల శాఖ ప్రవీణ్ కుమార్ , లీడ్ బ్యాంకు మేనేజర్ రవి ప్రసాద్, ఆర్టీవో శ్రీనివాస రావు, ఇడి ఎస్సి కార్పొరేషన్ ముజాహిద్, డిడి గిరిజన శాఖ విజయలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాస చారి, జిల్లా ఉపాధికల్పన అధికారిణి మాధవి, పరిశ్రమల శాఖ ఏడి నకుల్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు

-ఎరువుల గోదాంలు మరియు విక్రయ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ

హంసకలం వార్త జూన్17



జిల్లాలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. గిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామం లోని పీఏసీఎస్ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న ఎరువుల విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా అప్ ద్వారా విక్రయాల ను పరిశీలి ంచారు. రైతులకు కావలిసిన యూరియా నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. అప్ ద్వారా యూరియా బుక్ చేసుకుని కొనుగోలు చేయాలని సూచించారు. సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన గోదాముల నిర్మాణానికి సంబంధించి పనులు తక్షణమే చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ ను ఆదేశించారు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూరు గ్రామంలో గోదాముల నిర్మాణానికి సంబంధించి ప్రదిపాదిత స్థలాన్ని పరిశీలించారు. జిల్లాలో పెరుగుతున్న పంటల దిగుబడికి అనుగుణంగా గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాబార్డ్ సహకారంతో సహకార శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదిత గోదాముల నిర్మాణం తో జాబితాపూరు ప్రాంతం జిల్లాలో ధాన్యం నిల్వ కేంద్రం గా మారుతుందని అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గోదాముల నిర్మాణాన్ని పరిశీలించారు. అదేవిధంగా అంతర్గాం గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో జిల్లా సహకార అధికారి చెరుకు మనోజ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వి.భాస్కర్, ఏ డి ఏ నాయక్, రూరల్ తాశీల్దార్ హకీం మరియు తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ బడుల్లోనే మంచి విద్య అందుతుంది

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

హంసకలం వార్త జూన్17



ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పేర్కొన్నారు. బుధవారం కుంటాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను తెలుసు కున్నారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, బడికి హాజరుకాని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చేలా చూడాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచిస్తూ,అపరిశుభ్రతపై అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు.10 వ తరగతి విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్, చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కూడా అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులకు లెక్కలు చేయించి,పలు ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరీక్షించారు .పాఠ్యాంశాలతో పాటు విద్యార్థుల నైపుణ్యాల పెంపుపై దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ప్రాంగణంలోని ట్రాన్స్ ఫార్మర్‌ను పరిశీలించి మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. వసతి గృహాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని ఆదేశించారు.అనంతరం కుంటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలు, రికార్డులను పరిశీలించారు. కాలానుగుణ వ్యాధుల నేపథ్యంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం అందకూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించి, చిన్నారులతో ముచ్చటించారు. విద్యా ర్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహిం చారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీఓ వనజ, మండల విద్యాధికారి ముత్యం, సర్పంచ్ గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి జూపల్లి

-కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మౌలిక వసతులు

-గోపాల్ దీన్నే గ్రామంలో నూతన సబ్ స్టేషన్ ను ప్రారంభం

హంసకలం వార్త జూన్17



కొల్లాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం శ్రీకారం చుట్టారు.వీపనగండ్ల మండలం గోపాలదిన్నె గ్రామంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని టెంకాయ కొట్టి మంత్రి ప్రారంభించారు.సబ్ స్టేషన్ నిర్మాణంతో గోపాల్ దీన్నే, రంగవరం గ్రామాల ప్రజలకు విద్యుత్ ఇబ్బంద్దులు ఉండవని మంత్రి గారు అన్నారు. అనంతరం ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

-నిర్మాణ పనులకు మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన

వీపనగండ్లలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అదనపు మౌలిక వసతుల నిర్మాణ పనులకు మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు.అనంతరం విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.భోజన నాణ్యతపై మంత్రి ఆరా తీశారు. ఏ సమస్య ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు.ప్రజాప్రభుత్వంలో సర్కారీ బడుల్లో విద్యా ప్రమాణాలు పెరిగాయని, తల్లిదండ్రులు విద్యార్థిని, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో మరణించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కును అందజేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

హంసకలం వార్త జూన్17



జిల్లా ఆర్మడ్ రిజర్వ్ విభాగంలో విధులు నిర్వరస్తూ అనారోగ్యంతో ఇటీవల మరణించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజ్ మహమూద్ కుటుంబానికి బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో చెక్కు రూపంలో 1,00,000/- (లక్ష రూపాయల) నగదును అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో నిరంతరం విధులు నిర్వర్తించే అధికారులు మరియు సిబ్బంది తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు .మరణించిన పోలీసుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ప్రభుత్వం తరపున మరణించిన పోలీసు అధికారుల కుటుంబాలకు అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ ఏవో మంజ్యా నాయక్, పోలీస్ అధికారుల సంఘం సభ్యుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# సోలార్ ప్లాంట్ పెట్టండి,లాభాలు ఆర్జించండి

-నాబార్డు ద్వారా రుణం పొందండి
-సహకార సంఘాలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు

హంసకలం వార్త జూన్17



సహకార సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటే పెద్ద ఎత్తున లాభాలు ఆర్జించే అవకాశం ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. 1 మెగావాట్ సామర్థ్యంతో ఏర్పాటు చేసే ఒక్కో సోలార్ ప్లాంట్ ద్వారా ఏటా రూ.50 లక్షల ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు నాబార్డు ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. సక్రమంగా ఈఎంఐ చెల్లించే సహకార సంఘాలకు 1 శాతం వడ్డీకే రుణాలు లభిస్తాయన్నారు. బుధవారం చొప్పదండి పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ తొలుత జన ఔషధి కేంద్రాన్ని సందర్శించారు. జన ఔషధి కేంద్రానికి వస్తున్న ఆదరణపై ఆరా తీశారు. అతి తక్కువ ఖర్చుతో జన ఔషధిలో మందులు అందుబాటులో ఉన్నాయని, వినియోగించుకోవాలని ప్రజలను కోరారు.కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సహకార సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన వ్యయంలో 80 శాతానికిపైగా నాబార్డు రుణ సౌకర్యం కల్పిస్తోంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో తొలిసారి చొప్పదండి లోనే సోలార్ ప్లాంట్ ఏర్పాటు కావడం అభినందనీయం. ఈ ప్లాంట్ ద్వారా 1 మెగావాట్ కరెంట్ ను ఉత్పత్తి చేయవచ్చు. ఒక్కో యూనిట్ ను 3 రూపాయల చొప్పున విద్యుత్ డిస్కంలు కొనుగోలు చేస్తాయి.వాస్తవానికి 1 మెగావాట్ ఉత్పత్తి కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అయ్యే మొత్తం ఖర్చు 3 కోట్ల 80 లక్షల రూపాయలు. సహకార సంఘం 40 లక్షలు వెచ్చించాలి. మిగిలిన 3 కోట్ల 40 లక్షల రూపాయలను నాబార్డ్ సంస్థ రుణం రూపంలో ఇస్తోంది. వడ్డీ 4 శాతం. ఒకవేళ సక్రమంగా ఈఎంఐ చెల్లిస్తే 3 శాతం వడ్డీని తిరిగి చెల్లిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారీ వర్షాల వల్ల ఏ ఒక్కరికి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ యంత్రాంగం ముందస్తు అప్రమత్తం

-నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదు..
-వీడియో కాన్ఫిరెన్స్ లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్

హంసకలం వార్త జూన్17




జిల్లాలో రానున్న రోజుల్లో భారీ వర్షాల వల్ల ఏ ఒక్కరికి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ యంత్రాంగం ముందస్తు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. రానున్న వర్షాలు, నకిలీ విత్తనాల విక్రయాలపై తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై జిల్లా పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్ లో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని గతంలో పడిన భారీ వర్షాలతో చెరువులు, కుంటల వద్ద నీటి ఉధృతి ప్రవహించడం ద్వారా దెబ్బ తిన్న వంతెనలు, చప్టలను సందర్శించడం, వరద ప్రభావం ఎంతవరకు వచ్చిందో పరిశీలించి స్థానిక ప్రజలతో మాట్లాడి ప్రమాదాల భారీన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ముంపు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలకు తక్షణ సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.అదేవిధంగా వర్షాల వల్ల ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా, నీరు నిల్వ ఉండకుండా మున్సిపల్, ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ రోడ్లను క్లియర్ చేయాలని స్పష్టం చేశారు ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా పకడ్బంది చర్యలు తీసుకోవాలని, ఎవరైనా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నాసి రకం, నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. ముఖ్యంగారైతులు సైతం విత్తనాలు కొనుగోలు సమయంలో అప్రమత్తత పాటించాలన్నారు. తక్కువ ధరలకు తెలియని వ్యక్తుల నుండి కొనుగోలు చేసి మోసపోవద్దని అన్నారు. కొంతమంది దళారులు ముఠాలుగా ఏర్పడి, తక్కువ డబ్బుకు విత్తనాలు ఇస్తామని ఆశ చూపి రైతులను మోసం చేస్తారని, ఇటువంటి వారిపై గ్రామాల్లో సైతం నిఘా పెట్టామని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వెంటనే మండల వ్యవసాయ శాఖ అధికారికి గాని స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మార్కెట్ లో నకిలీ విత్తనాల విక్రయం జరుగకుండా టాస్క్ ఫోర్స్ బృందాల నిరంతరం పర్యవేక్షణ వుంటుందని తెలిపారు.

## నేషనల్ అప్రెంటీస్ షిప్ ట్రైనింగ్ స్కీం ను సద్వినియోగం చేసుకోవాలి... జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

-యువతకు విస్తృత అవగాహన కల్పించాలి..

హంసకలం వార్త జూన్17



నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ (NATS 2.0) ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులు, సంస్థలతో సమావేశం నిర్వహించారు.

-ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,

నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ లో పాలిటెక్నిక్, డిగ్రీ విద్యార్థులు, సంస్థలు భాగస్వాములు కావాలని అన్నారు. నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ (NATS 2.0)' ద్వారా తెలంగాణలోని యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఇంజనీరింగ్, డిప్లొమా, ఆర్ట్స్, సైన్స్, కామర్స్ అభ్యసించిన యువతకు పరిశ్రమలలో నైపుణ్య శిక్షణ (On-the-Job Training) అందించడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ అన్నారు. ఈ పథకం ద్వారా పరిశ్రమలు తమకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను సులభంగా ఎంపిక చేసుకోవచ్చని, శిక్షణ పొందుతున్న అప్రెంటిస్‌లకు ఇచ్చే స్టైఫండ్‌లో ప్రభుత్వ వాటా నేరుగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ ద్వారా అభ్యర్థుల ఖాతాలకు జమ చేయబడుతుందని తెలిపారు. అప్రెంటిస్‌షిప్ పూర్తయిన తర్వాత సంస్థలకు నేరుగా పరిశ్రమ ప్రమాణాలకు తగ్గట్టుగా తయారైన ఉద్యోగులు లభిస్తారని కలెక్టర్ అన్నారు. నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ (NATS 2.0) పోర్టల్ ద్వారా సంస్థలు అప్రెంటిస్ ఖాళీలను ప్రకటించడం, దరఖాస్తులను పరిశీలించడం, కాంట్రాక్టులను సృష్టించడం వంటివి పూర్తిగా డిజిటల్ విధానంలో చేసుకోవచ్చని కలెక్టర్ అన్నారు. తెలంగాణలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, ఎంఎస్ఎంఈ సంస్థలు అప్రెంటిస్‌లను నియమించుకోవడానికి నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ అధికారిక పోర్టల్‌లో తమ సంస్థను నమోదు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జి.ఎం. పరిశ్రమల శాఖ ప్రవీణ్ కుమార్ , లీడ్ బ్యాంకు మేనేజర్ రవి ప్రసాద్, ఆర్టీవో శ్రీనివాస రావు, ఇడి ఎస్సి కార్పొరేషన్ ముజాహిద్, డిడి గిరిజన శాఖ విజయలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాస చారి, జిల్లా ఉపాధికల్పన అధికారిణి మాధవి, పరిశ్రమల శాఖ ఏడి నకుల్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోండి

-పోలీస్ కమిషనర్ సునీల్ దత్

హంసకలం వార్త జూన్17



జూన్ 20 వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ విజ్ఞప్తి చేశారు. చిన్న చిన్న కక్షలు పెంచుకుని...ఆర్థిక భారంతో పాటు సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఇరువైపుల సమ్మతితో సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం అందుబాటులో ఉందని తెలిపారు. రాజీ చేసుకునే అవకాశమున్న వివిధ రకాల కేసులు క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితం డ కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసులు, డ్రంకన్ డ్రైవ్, మోటారు వాహన చట్ట ఉల్లంఘనలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం తదితర కేసులు పరిష్కరించుకోవచ్చు అని వివరించారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు.

## ఎన్టీఆర్ విగ్రహం దహనం కేసు ఛేదన..విద్వేషాల కుట్ర భగ్నం

-నల్లగొండలో ఇద్దరు నిందితుల అరెస్ట్..కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం
-సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలతో నిందితుల గుర్తింపు
-ప్రజల మధ్య ఉద్రిక్తతలు సృష్టించే కుట్రలను ఉపేక్షించబోమన్న జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్




హంసకలం వార్త జూన్17

నల్లగొండ పట్టణంలో జూన్ 6వ తేదీ తెల్లవారుజామున చోటుచేసుకున్న ఎన్టీఆర్ విగ్రహం దహనం ఘటనను నల్లగొండ టూ టౌన్ పోలీసులు విజయవంతంగా ఛేదించారు.ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి సామాజిక ఉద్రిక్తతలను సృష్టించాలనే ఉద్దేశంతో ఈ ఘటనకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు.నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఎన్.జి.కళాశాల సమీపంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి,ప్రముఖ సినీ నటుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి తగులబెట్టిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.ఈ ఘటనపై మున్సిపల్ 48వ వార్డు అధికారి బుజనూరి స్వప్న ఫిర్యాదు మేరకు నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నం.232/2026 కింద దీచీూ సెక్షన్లు 326(ఛీ),196,126(2), 324(4),292 మరియుౌాఌూాౌాఙౕ–1984 సెక్షన్–4 ప్రకారం నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు డీఎస్పీ కె.శివరాంరెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. నల్లగొండ సీసీఎస్,టూ టౌన్ పోలీసుల సంయుక్త బృందాలు సంఘటన స్థలం పరిసర ప్రాంతాల్లోని వందలాది గంటల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించాయి.అనుమానాస్పద వాహనాల కదలికలు,సాంకేతిక ఆధారాలు, ప్రయాణ వివరాలను విశ్లేషిస్తూ నిందితుల జాడను కనుగొన్నారు. ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలను లక్ష్యంగా చేసుకుని వాటిని ధ్వంసం చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ కుట్రలో భాగంగా మొదట నల్లగొండలోని ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎంపిక చేసుకుని, సంఘటనకు ముందు అక్కడి పరిస్థితులను పరిశీలించి,దాడికి సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేసినట్లు దర్యాప్తులో బయటపడింది.జూన్ 6వ తేదీ తెల్లవారుజామున సుమారు 3:45 గంటల సమయంలో నిందితులు పాలకురి అశోక్ కుమార్ గౌడ్‌కు చెందిన బలెనో కారు నంబర్ ఝా–07–ఞ–2430 లో నల్లగొండకు చేరుకున్నారు.ముందస్తుగా తెచ్చుకున్న రెండు పాత బెడ్‌షీట్లను ఎన్టీఆర్ విగ్రహంపై కప్పి,ఒక లీటర్ పెట్రోల్ పోసి నిప్పంటించి అక్కడి నుంచి పరారయ్యారు.ఈ ఘటన ద్వారా ప్రజల్లో ఆగ్రహం,ఆందోళన రేకెత్తించి ప్రజల మధ్య ఉద్రిక్త పరిస్థితులు సృష్టించాలనే కుట్ర పన్నినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో నిందితులైన పాలకురి అశోక్ కుమార్ గౌడ్ (45), ప్రైవేట్ లెక్చరర్,చైతన్యపురి,హైదరాబాద్ మరియు ఎలుకంటి ప్రణీత్ (23),ప్రైవేట్ ఉద్యోగి,మహేశ్వరం మండలం,రంగారెడ్డి జిల్లాలను అరెస్టు చేశారు.వారి వద్ద నుండి నేరానికి ఉపయోగించిన బలెనో కారు మరియు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న డిజిటల్ ఆధారాలను సైతం పోలీసులు విశ్లేషిస్తున్నారు.ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం,ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్పష్టం చేశారు. సామాజిక శాంతి,సామరస్యాలను దెబ్బతీసే కుట్రలను పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఇటువంటి ఘటనలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించి నిందితులను అరెస్టు చేసిన డీఎస్పీ కె.శివరాంరెడ్డి,టూ టౌన్ సీఐ ఎస్.రాఘవరావు,సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు డి.చంద్రశేఖర్ రెడ్డి, జితేందర్ రెడ్డి,రూరల్ ఎస్ఐ డి.సైదాబాబు,హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్ గిరి,సీసీఎస్ సిబ్బంది పుష్పగిరి,శివరాజు,సాయి,నరేశ్, నాగార్జున,కమల్,టూ టౌన్ సిబ్బంది బాలకోటి,షకీల్,శంకర్ లను జిల్లా ఎస్పీ అభినందించారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడంలో అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకం

-జిల్లా కలెక్టర్ రాజర్షి షా

హంసకలం వార్త జూన్17




ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి,వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడంలో అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో లెక్చరర్ల తో ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..."నాణ్యమైన విద్య... ఉజ్వల భవిష్యత్తు"అనే ధ్యేయంతో ప్రభుత్వం పనిచేస్తోందని, మారుతున్న కాలానికి, సాంకేతికతకు అనుగుణంగా లెక్చరర్లలో బోధనా నైపుణ్యాలను పెంపొందించేందుకు నెల రోజుల శిక్షణా తరగతులను రూపకల్పన చేసినట్లు వివరించారు.ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థులకు అత్యుత్తమ ఫలితాలు అందేలా నూతన బోధనా పద్ధతులను అవలంబించాలని లెక్చరర్లకు పిలుపునిచ్చారు.నెల రోజులకు పైగా సాగే ఈ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని అధ్యాపకులందరూ పూర్తి బాధ్యతతో,శ్రద్ధతో సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖ అధికారి జాదవ్ గణేష్ కుమార్, ప్రిన్సిపాల్స్ బస భగవాన్లు,కె.సునీల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వరపతి,జిల్లా పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, తెలంగాణ మైనారిటీస్ సంక్షేమం,కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల జూనియర్ లెక్చరర్లు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇతర జూనియర్ లెక్చరర్లు, తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## పిజ్జా హాట్‌కు గుడ్‌బై చెబుతున్న యమ్ బ్రాండ్స్.. రూ.25 వేల కోట్లకు అమ్మకం




ఇంటర్నెట్ డెస్క్:
ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పిజ్జా హాట్ రెస్టారెంట్స్ చైన్ యాజమాన్యం మారబోతోంది. కేఎఫ్‌సీ, టాకో బెల్ వంటి బ్రాండ్లకు కూడా మాతృసంస్థ అయిన యమ్ బ్రాండ్స్ పిజ్జా హాట్‌ను మొత్తం 2.7 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.25 వేల కోట్లు) విక్రయిస్తున్నట్లు ప్రకటించింది. ఈ అమ్మకాన్ని రెండు వేర్వేరు ఒప్పందాల ద్వారా పూర్తి చేయనుంది. .ఒప్పందం ప్రకారం.. చైనా మినహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పిజ్జా హాట్ వ్యాపారాన్ని ప్రైవేట్ ఈక్విటీ సంస్థ లాంగ్‌రేంజ్ క్యాపిటల్ 1.5 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేయనుంది. అలాగే చైనాలోని 4,375 పిజ్జా హాట్ రెస్టారెంట్లను యమ్ చైనా హోల్డింగ్స్ 1.2 బిలియన్ డాలర్లకు సొంతం చేసుకోనుంది. గత కొన్నేళ్లుగా పిజ్జా హాట్ అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేవు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ముడి సరుకుల ధరల పెరుగుదల, వినియోగదారుల ఆహారపు అలవాట్లలో మార్పులు కంపెనీపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా అమెరికాలో పిజ్జా హాట్ అమ్మకాలు కొన్నేళ్లుగా క్షీణిస్తూ వస్తున్నాయి . ప్రపంచంలోని అనేక మార్కెట్లలో పిజ్జా హాట్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, చైనాలో మాత్రం అద్భుతమైన వృద్ధిని నమోదు చేసింది. స్థానిక వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా మెనూలు రూపొందించడం, కొత్త స్టోర్ మోడళ్లను ప్రవేశపెట్టడం వల్ల అక్కడి వ్యాపారం బలంగా కొనసాగుతోంది.

# ఎలన్ మస్క్ సంపద రూ.100 లక్షల కోట్లు

న్యూయార్క్ :
ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా అవతరించారు. ఇది లక్ష కోట్ల డాలర్లు లేదా సుమారు రూ.100 లక్షల కోట్లకు పైగా సంపదకు సమానం. ఇప్పటివరకు ఈ స్థాయి సంపదకు చేరిన ఏకైక వ్యక్తి మస్క్ మాత్రమే. మస్క్‌కు చెందిన అంతరిక్ష పరిశోధనా సంస్థ స్పేస్‌ఎక్స్ వాల్ స్ట్రీట్ స్టాక్ మార్కెట్‌లో కొత్త చరిత్ర సృష్టించింది. ఎస్‌పిసిఎక్స్ టిక్కర్‌తో నాస్‌డాక్‌లో రంగప్రవేశం చేసిన ఈ సంస్థ.. ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ ద్వారా రికార్డు స్థాయిలో 75 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.7 లక్షల కోట్లు) నిధులను సమీకరించడమే కాకుండా.. తొలిరోజే షేరు ధర 19 శాతం లాభంతో160.95 డాలర్ల వద్ద ముగిసింది. ఈ భారీ జంప్‌తో స్పేస్‌ఎక్స్ మార్కెట్ విలువ 2.1 ట్రిలియన్ డాలర్లకు చేరడంతో అమెరికాలోనే ఆరో అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీగా ఆవిర్భవించింది. ఇదే సమయంలో ఎలాన్ మస్క్ వ్యక్తిగత సంపద 1.11 ట్రిలియన్లకు (సుమారు రూ. 104 లక్షల కోట్లు) చేరుకోవడంతో ప్రపంచ చరిత్రలోనే అధికారికంగా ఒక ట్రిలియన్ డాలర్ల మార్కును దాటిన మొట్టమొదటి వ్యక్తిగా (ట్రిలియనీర్) మస్క్ సరికొత్త ప్రపంచ రికార్డును సృష్టించారు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం.. ఎలాన్ మస్క్ ఒక్కడి సంపదే ఇప్పుడు ప్రపంచంలోని తర్వాతి నలుగురు అగ్ర కుబేరులైన జెఫ్ బెజోస్, లారీ పేజ్, సెర్గీ బ్రిన్, లారీ ఎల్లిసన్ల ఉమ్మడి ఆస్తుల విలువ (1.089 ట్రిలియన్లు) కంటే ఎక్కువగా 1.11 ట్రిలియన్లుగా ఉండటం విశేషం. స్పేస్‌ఎక్స్ సంస్థ 2025 సంవత్సరానికి గానూ 18.67 బిలియన్ల ఆదాయాన్ని ఆర్జించినప్పటికీ 4.94 బిలియన్ల నికర నష్టాన్ని చవి చూసింది. అయినప్పటికీ శాటిలైట్ బ్రాడ్ బాండ్ స్టార్‌లింక్, అంతరిక్ష ప్రయోగాలు, రక్షణ రంగ కాంట్రాక్టులు, కృత్రిమ మేధస్సు రంగాల్లో ఈ కంపెనీకి ఉన్న ఉజ్వల భవిష్యత్తుపై నమ్మకంతో ఇన్వెస్టర్లు మొదటి రోజే 50 కోట్లకు పైగా షేర్లను ట్రేడ్ చేశారు. కాగా.. ఈ ఐపిఒ తర్వాత కూడా క్లాస్ బి షేర్ల ద్వారా కంపెనీలోని దాదాపు 82.4 శాతం ఓటింగ్ హక్కులు ఎలాన్ మస్క్ నియంత్రణలోనే కొనసాగనున్నాయి.



# 3 రోజుల్లో రూ.20 లక్షల కోట్లు

ముంబై:
భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరనున్న నేపథ్యంలో ముడి చమురు ధర 80 డాలర్ల దిగువకు జారుకోవడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లు ర్యాలీ తీయడం ఇందుకు దోహదపడింది. మంగళవారం ట్రేడింగ్‌లో ఐటీ, ఇంధనం, బ్యాంకింగ్ రంగ షేర్ల కొనుగోళ్లతో సెన్సెక్స్ మరో 544.15 పాయింట్లు బలపడి 76,808.48 వద్దకు చేరింది. నిఫ్టీ 135.25 పాయింట్ల వృద్ధితో 23,989.15 వద్ద ముగిసింది. బీఎ?సఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.1.75 లక్షల కోట్లు పెరిగి రూ.472.24 లక్షల కోట్లకు (4.99 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. గడిచిన మూడు సెషన్లలో సెన్సెక్స్ 2,975.93 పాయింట్లు (4•), నిఫ్టీ 827.55 పాయింట్లు (3.57•) పుంజుకోగా.. మదుపరుల సంపద రూ.19.99 లక్షల కోట్ల మేర పెరిగింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 5 పైసలు బలపడి రూ.94.53 వద్ద ముగిసింది. గడిచిన మూడు సెషన్లలో రూపాయి మారకం విలువ 132 పైసలు పెరిగింది. ముడి చమురు ధరల తగ్గుదల ఇందుకు దోహదపడింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు బ్యారల్ ధర ఒక దశలో 4 వరకు నష్టపోయి 79.61 డాలర్లకు జారుకుంది. బ్రెంట్ క్రూడ్ 80 డాలర్ల దిగువకు జారుకోవడం మార్చి తర్వాత మళ్లీ ఇదే మొదటిసారి.




## ముక్కోణపు సిరీస్: భారత్-ఎ ఘన విజయం-ఫైనల్ బెర్తు ఖరారు

ఇంటర్నెట్ డెస్క్:
ముక్కోణపు సిరీస్‌లో భాగంగా దంబుల్లా వేదికగా అఫ్గానిస్థాన్-ఎపై భారత్-ఎ జట్టు ఘన విజయం సాధించింది. 320 పరుగుల లక్ష్య ఛేదనలో అఫ్గాన్-ఎ జట్టు 36.5 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌటైంది. దీంతో అఫ్గాన్‌పై భారత్ 101 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. ఈ గెలుపుతో మెరుగైన నెట్ రన్ రేట్ (+0.797) సాధించిన టీమిండియా.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుని ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది.తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన భారత్-ఎ జట్టు 9 వికెట్లు కోల్పోయి 319 పరుగుల భారీ స్కోర్ చేసింది. ప్రియాంశ్ ఆర్య(58), కుమార్ కుషాగ్రా(58), తిలక్ వర్మ(59) హాఫ్ సెంచరీలు చేశారు. వైభవ్ సూర్యవంశీ(38), రుతురాజ్ గైక్వాడ్(30), విప్రాజ్ నిగమ్(30) పర్వాలేదనిపించారు. సూర్యాంశ్(7), అనుకుల్ రాయ్(4), అన్షుల్ కాంబోజ్(0) విఫలమయ్యారు. అఫ్గాన్ బౌలర్లలో ఫరీదూన్ 2, అబ్దుల్లా 2, ఫర్మానుల్లా 2, జహీర్ ఖాన్ 1 వికెట్ పడగొట్టారు. అనంతరం 320 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్గాన్ బ్యాటర్లు తడబడ్డారు. బహిర్ షా(57), ఫైసల్ షినోజాదా(46), ఇమ్రాన్ మిర్(32) రాణించారు. మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. భారత్-ఎ బౌలర్లలో నిశాంత్ సింధు 4 వికెట్లతో చెలరేగాడు. యశ్ ఠాకూర్ 2, అన్షుల్ కాంబోజ్, విప్రాజ్ నిగమ్, సూర్యాంశ్, అనుకుల్ రాయ్ తలొక వికెట్ పడగొట్టారు.




## అఫ్గాన్‌పై సూపర్ సెంచరీ - ఇషాన్ కిషన్ అరుదైన ఘనత

ఇంటర్నెట్ డెస్క్:
లఖ్‌నవూ వేదికగా భారత్-అఫ్గానిస్థాన్ జట్లు రెండో వన్డేలో తలపడుతున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కి దిగిన టీమిండియా ప్లేయర్లు.. విధ్వంసం సృష్టిస్తున్నారు. ఈ మ్యాచ్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్, వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు. 79 బంతుల్లో ఏకంగా 125 పరుగులు చేసి ఔటయ్యాడు. ఇందులో 14 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. అతడికి ఇది రెండో వన్డే సెంచరీ కావడం విశేషం. ఈ క్రమంలో ఇషాన్ తన వన్డే కెరీర్‌లో 1000 పరుగుల మైలురాయిని అందు కున్నాడు. ఇషాన్ కిషన్ ఈ వెయ్యి పరుగుల మైలురాయిని కేవలం 26 ఇన్నింగ్స్‌లోనే చేరుకు న్నాడు. దీంతో భారత్ తరపున అత్యంత వేగంగా వెయ్యి వన్డే పరుగులు పూర్తి చేసిన ప్లేయర్ల జాబితాలో అతడు నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ జాబితాలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్(19 ఇన్నింగ్స్) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. కాగా విరాట్ కోహ్లీ, శిఖర్ ధావన్(24 ఇన్నింగ్స్) రెండో స్థానంలో, నవ్‌జ్యోత్ సింగ్, శ్రేయస్ అయ్యర్(25 ఇన్నింగ్స్) మూడో స్థానంలో ఉన్నారు.

**-మరో రికార్డు..**

71 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్న ఇషాన్ కిషన్.. తన ఖాతాలో మరో రికార్డు కూడా వేసుకున్నాడు. వన్డేల్లో అఫ్గాన్‌పై ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన రెండో భారత ప్లేయర్‌గా ఇషాన్ నిలిచాడు. అతడి కంటే ముందు స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ఉన్నాడు. 2023లో 63 బంతుల్లోనే రోహిత్ శర్మ శతక్కొట్టాడు. కాగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 77 బంతుల్లో సెంచరీ చేసి.. ఈ జాబితాలో మూడో భారత ప్లేయర్‌గా నిలిచాడు.



# స్పోర్ట్స్

## భారత్-అఫ్గాన్ రెండో వన్డే: సెంచరీలతో చెలరేగిన గిల్, ఇషాన్ కిషన్




ఇంటర్నెట్ డెస్క్:
లఖ్‌నవూ వేదికగా భారత్, అఫ్గానిస్థాన్ జట్లు రెండో వన్డేలో తలపడుతున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా.. విధ్వంసం సృష్టించింది. 49.5 ఓవర్లలో 402 పరుగుల భారీ స్కోర్ చేసి ఆలౌటైంది. అఫ్గానిస్థాన్‌కు 403 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(154; 110 బంతుల్లో 22 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఇషాన్ కిషన్(125; 79 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్స్‌లు) సెంచరీలతో విజృంభించారు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు 140 బంతుల్లో 224 పరుగులు భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. యశస్వి జైస్వాల్(4) మరోసారి నిరాశపర్చాడు. స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ(48; 39 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) త్రుటిలో హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. స్వల్ప స్కోరుకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన టీమిండియాను.. గిల్, ఇషాన్ కిషన్ గాడీలో పెట్టారు. వారిద్దరూ ఔటయ్యాక ప్లేయర్లు వరుసగా పెవిలియన్ బాట పట్టారు. శ్రేయస్ అయ్యర్(26), వాషింగ్టన్ సుందర్(19) పర్వాలేదనిపించారు. కేఎల్ రాహుల్(0), గుర్నూర్ బ్రార్(3), అర్ష్‌దీప్ సింగ్(3), ప్రిన్స్ యాదవ్(5) వరుసగా ఔటయ్యారు. అఫ్గాన్ బౌలర్లలో నంగేయాలియా 4, రషీద్ ఖాన్ 3, ఘజన్‌ఫర్, సలీమ్ సాఫీ తలొక వికెట్ పడగొట్టారు.

# కత్తి పట్టిన ఆధునిక సీత

## అదరగొడుతున్న అలియా భట్ 'ఆల్ఫా' ట్రైలర్

-ఆధునిక సీతగా అలియా భట్..
'ఆల్ఫా'గా యాక్షన్ అవతార్
-వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో భాగంగా
రానున్న కొత్త చిత్రం
-అలియా తండ్రిగా బాబీ డియోల్
కీలక పాత్రలో అనిల్ కపూర్
-'వార్' కబీర్‌గా అతిథి పాత్రలో
మెరవనున్న హృతిక్ రోషన్
-జులై 3న థియేటర్లలోకి రానున్న 'ఆల్ఫా'

బాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిలిమ్స్ (వైఆర్ఎఫ్) తమ స్పై యూనివర్స్‌లో మరో కొత్త చిత్రాన్ని ప్రకటించింది. అలియా భట్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు 'ఆల్ఫా' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను తాజాగా విడుదల చేయగా, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమా జులై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రంలో అలియా భట్ 'సీత' అనే ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. చిన్నతనం నుంచే ఆమె తండ్రి (బాబీ డియోల్) ఒక కఠినమైన సీక్రెట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఆమెను ఒక కిరాయి హంతకురాలిగా తీర్చిదిద్దుతాడు. ఆధునిక కాలపు సీత తనదైన 'అగ్ని పరీక్ష'ను ఎలా ఎదుర్కొంది అనే థీమ్‌తో ఈ సినిమా సాగనుంది. టీజర్‌లో అలియా భట్ భీకరమైన యాక్షన్ సన్నివేశాల్లో కనిపించారు. కత్తి యుద్ధాలు, ఛేజింగ్ సీన్లు ఆమె పాత్రలోని క్రూరమైన, భీకరమైన కోణాన్ని ఆవిష్కరించాయి. 18వ పుట్టినరోజునే ఆమెను 'ఆల్ఫా' అనే ఎలైట్ ఆపరేటివ్‌గా మార్చే సన్నివేశాలుసినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. ఈ సినిమాలో అలియా భట్‌తో పాటు మరో నటి శర్వరీ వాఘ్ కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇద్దరు మహిళా ఆపరేటివ్‌లు కలిసి ఒక శక్తివం తమైన శత్రువును ఎలా ఎదుర్కొన్నారు అనేది కథలో కీలకం. సీనియర్ నటుడు అనిల్ కపూర్ ఒక ముఖ్యమైన ఇంటెలిజెన్స్ అధికారి పాత్రలో నటిస్తుండగా, ఈ సినిమాకు అసలైన హైలైట్ హృతిక్ రోషన్ కావడం విశేషం. వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లోని 'వార్' సిరీస్‌లో తను పోషించిన 'కబీర్' పాత్రలో హృతిక్ ఇందులో ప్రత్యేక అతిథిగా కనిపించనున్నారు. దీంతో ఈ సినిమా కూడా టైగర్, వార్ ఫ్రాంచైజీల ప్రపంచంలో భాగమని స్పష్టమైంది. 'ది రైల్వే మెన్' సిరీస్‌తో విమర్శకుల ప్రశంసలు పొందిన శివ్ రావల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆదిత్య చోప్రా నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారతదేశంలో పూర్తిస్థాయిలో మహిళా ప్రధాన పాత్రలతో వస్తున్న తొలి భారీ యాక్షన్ చిత్రంగా 'ఆల్ఫా' నిలవనుంది. పోస్ట్ ప్రొడక్షన్, వీఎఫ్ఎక్స్ పనుల్లో ఆలస్యం కారణంగా పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా జులై 3న విడుదల కానుంది.





### ఒక్క డీల్‌కే రూ.76 లక్షలు.. పార్టీకి రావాలంటే రూ.25 లక్షలు.. తన సంపాదన రహస్యం చెప్పిన ఓరీ!



సోషల్ మీడియా సంచలనం ఓర్హాన్ అవత్రమణి, అందరికీ 'ఓరీ'గా సుపరిచితుడు, తన సంపాదన గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అసలు ఓరీ ఏం పని చేస్తాడు, అతని ఆదాయం ఎక్కడి నుంచి వస్తుందనే ప్రశ్నలకు ఎట్టకేలకు సమాధానం దొరికింది. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఓరీ, తన సంపాదన లెక్కలు బయటపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచాడు.కావ్యా కర్ణాటక్ హోస్ట్ చేసిన 'లెర్న్ బై కేకే క్రియేట్' అనే పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ, గతనెలలో కేవలం ఒక్క సోషల్ మీడియా డీల్ ద్వారానే రూ.76 లక్షలు సంపాదించినట్లు ఓరీ వెల్లడించాడు. "గత నెలలో నేను ఒకే ఒక్క డీల్‌పై, అంటే ఒక రీల్ ద్వారా రూ.76 లక్షలు సంపాదించాను" అని చెప్పడంతో, బ్రాండ్లు ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ కోసం ఎంత భారీగా ఖర్చు చేస్తున్నాయోనని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. ఈ వ్యాఖ్య సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన సంపాదన కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాదని, ప్రైవేట్ ఈవెంట్లకు హాజరయ్యేందుకు కూడా తాను ఫీజు తీసుకుంటానని ఓరీ స్పష్టం చేశాడు. లంచ్, డిన్నర్, పుట్టినరోజు పార్టీలు లేదా పెళ్లిళ్లకు హాజరయ్యేందుకు రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఛార్జ్ చేస్తానని తెలిపాడు. తనదైన శైలిలో మాట్లాడుతూ, "రూ.15 నుంచి 25 లక్షలకు మీరు నన్ను లంచ్‌కు, డిన్నర్‌కు కొనుక్కోవచ్చు. మీ పెళ్లికి వస్తాను, పుట్టినరోజు పార్టీకి వస్తాను. మనం చిన్ననాటి స్నేహితులం అన్నట్లు స్పీచ్ ఇస్తాను. మీ తల్లిదండ్రులతో కలిసి షాట్స్ తాగుతాను. మీరు కోరుకున్న ప్రతి ఒక్కరితో కలిసి ఫోటోలు దిగుతాను. ఇది మీరు కొనుక్కోగల ఒక అనుభవం" అని వివరించాడు.

### మెగాస్టార్ చిరంజీవి వ్యక్తిత్వంపై జగపతిబాబు ప్రశంసలు



టాలీవుడ్ సీనియర్ నటుడు జగపతిబాబు తాజాగా ఒక ఇంటర్వ్యూలో మెగాస్టార్ చిరంజీవి గురించి పంచుకున్న కొన్ని ఆసక్తికరమైన విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. జగపతిబాబు హీరోగా పరిచయమైన తొలి సినిమా 'సింహ స్వప్నం'. ఆ సినిమా ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టాల్సిందిగా కోరడానికి జగపతిబాబు, ఆయన తండ్రి వీబీ రాజేంద్రప్రసాద్ కలిసి చిరంజీవి ఇంటికి వెళ్లారట. అప్పట్లో చిరంజీవి గారు వరుస సినిమాలతో ఫుల్ బిజీగా, స్టార్‌డమ్‌లో పీక్స్‌లో ఉన్నప్పటికీ.. వీరిని ఎంతో ఆత్మీయంగా ఆహ్వానించారట. అంతేకాదు, జగపతిబాబును చూడగానే "చాలా అందంగా ఉన్నావు" అని మెచ్చుకుని, అడగడమే ఆలస్యం వెంటనే వచ్చి సినిమా ప్రారంభోత్సవానికి క్లాప్ కొట్టారని జగపతిబాబు గుర్తుచేసుకున్నారు. ఇక ఆ సంఘటన జరిగిన దాదాపు 35 సంవత్సరాల తర్వాత, 'పెద్ది' సినిమాలో జగపతిబాబు పోషించిన పాత్రను చూసి చిరంజీవి మళ్లీ అదే స్థాయిలో ఫోన్ చేసి మరీ ప్రశంసించారట. చిరంజీవిలోని ఆ గొప్ప గుణాన్ని జగపతిబాబు ఈ ఇంటర్వ్యూలో ఎంతో సంతోషంగా పంచుకున్నారు. ఒకప్పుడు హీరోగా ఎన్నో సూపర్ హిట్ సినిమాలు అందించిన జగపతిబాబు, ప్రస్తుతం వైవిధ్యమైన క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, పవర్‌ఫుల్ విలన్‌గా తనదైన నటనతో ప్రేక్షకులను అలరిస్తూ దూసుకుపోతున్నారు.

# భారత్‌కు క్రిస్టోఫర్ నోలన్ రాక

## ముంబైలో 'ది ఒడిస్సీ' గ్రాండ్ ప్రీమియర్




ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులకు, ముఖ్యంగా భారతీయ ప్రేక్షకులకు ఇది ఒక శుభవార్త. 'ఒపెన్‌హైమర్', 'ఇంటర్‌స్టెల్లార్', 'ఇన్‌సెప్షన్', 'ది డార్క్ నైట్' వంటి అద్భుతమైన చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న దిగ్గజ హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తొలిసారిగా భారత్‌లో అడుగుపెట్టనున్నారు. తన సరికొత్త చిత్రం 'ది ఒడిస్సీ' ప్రీమియర్ కోసం ఆయన జులైలో ముంబైకి రానున్నట్లు యూనివర్సల్ పిక్చర్స్ ఇంటర్నేషనల్ అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి నోలన్‌తో పాటు ఆ చిత్రంలో నటించిన ఆస్కార్ విజేత మ్యాట్ డామన్, ప్రముఖ నటుడు టామ్ హాలండ్, ఆస్కార్ అవార్డు గ్రహీత, నిర్మాత ఎమ్మా థామస్ కూడా హాజరుకానున్నారు. క్రిస్టోఫర్ నోలన్ సినిమా ఒకటి భారతదేశంలో ప్రీమియర్ జరుపుకోవడం ఇదే మొదటిసారి. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా జులై 17న థియేటర్లలోకి రానుంది.'ది ఒడిస్సీ' గ్లోబల్ ప్రీమియర్ టూర్‌లో భాగంగా లండన్, పారిస్, న్యూయార్క్ వంటి ప్రధాన నగరాలతో పాటు ముంబైని కూడా అధికారికంగా ఎంపిక చేయడం భారతీయ మార్కెట్‌కు ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది. హోమర్ రచించిన ఇతిహాసం 'ఒడిస్సీ' ఆధారంగా ఈ చిత్రాన్ని నోలన్ తెరకెక్కించారు. ట్రాయ్ పతనం తర్వాత ఒడిస్సియస్ పదేళ్లపాటు తన ఇంటికి తిరిగి వెళ్లే ప్రయాణాన్ని ఈ చిత్రంలో అద్భుతంగా చూపించనున్నారు.ఈ సినిమాకు ఒక ప్రత్యేకత ఉంది. సరికొత్త ఐమ్యాక్స్ ఫిల్మ్ టెక్నాలజీని ఉపయోగించి పూర్తిగా ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరించిన మొట్టమొదటి ఫీచర్ ఫిల్మ్ ఇదే కావడం విశేషం. ముంబైలోని ఫీనిక్స్ పల్లాడియంలో ఉన్న పీవీఆర్ ఐకాన్ ఐమ్యాక్స్ థియేటర్‌లో ఈ ప్రీమియర్ వేడుక జరగనుంది.ఈ చిత్రంలో మ్యాట్ డామన్, టామ్ హాలండ్‌లతో పాటు ఆన్ హాత్వే, రాబర్ట్ ప్యాటిన్సన్, లుపిటా యోంగో, జెండాయా, చార్లీజ్ థెరాన్ వంటి భారీ తారాగణం నటించింది. నోలన్, ఎమ్మా థామస్ తమ సింకోపీ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే భారతదేశంలోని పలు సినిమా థియేటర్లలో 'ది ఒడిస్సీ' ఐమ్యాక్స్ వెర్షన్ కోసం అడ్వాన్స్ టికెట్ల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. భారత గడ్డపై జరుగుతున్న అతిపెద్ద హాలీవుడ్ ఈవెంట్‌లలో ఒకటిగా ఈ ప్రీమియర్ నిలవనుంది.

# 'రమణి కల్యాణం' (ఈటీవీ విన్) మూవీ రివ్యూ!

సూర్య వశిష్ఠ – దీప్సిక చంద్రన్ ప్రధానమైన పాత్రలను పోషించిన సినిమానే 'రమణి కల్యాణం'. విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమా, మే 22వ తేదీన థియేటర్లలో విడుదలైంది. ఈ నెల 12వ తేదీ నుంచి 'ఈటీవీ విన్' లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమా కథేమిటనేది ఇప్పుడు చూద్దాం. సంజన (దీప్సిక) చూపులేని అమ్మాయి. తల్లీదండ్రులను కోల్పోయిన ఆమె, బామ్మ దగ్గరే పెరుగుతుంది. అనాథలైన నలుగురు పిల్లలను దత్తత చేసుకుని వాళ్ల ఆలనా పాలనా చూస్తుంటుంది. ఒక వైపున పబ్ లో సింగర్ గా.. మరో వైపున ఒక ఎఫ్ ఎమ్ రేడియోలో ఆర్జేగా పనిచేస్తుంటుంది. తనకి చూపు లేకపోవడాన్ని ఒక లోపంగా భావించడం ఆమెకి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళుతుంటుంది. అలాంటి సమయంలోనే ఆమెకి రాజ్ (సూర్య వసిష్ఠ) తారసపడతాడు. రాజ్ మంచి కవి అతని రెండు కాళ్లూ పనిచేయవు. అందువలన అతను వీల్ ఛైర్ కి పరిమితమవుతాడు. అనాథగా మిగిలిపోయిన రాజ్ ను అతని స్నేహితులైన కిశోర్ – గీత (శ్రీనివాసరెడ్డి – శ్యామల) దంపతులు చూసుకుంటూ ఉంటారు. రెండు కాళ్లను కోల్పోయిన కారణంగా రాజ్ చాలా డీలాపడిపోతాడు. పోయింది నడక మాత్రమే తప్ప, భవిష్యత్తు కాదనే సంజన మాటలు అతనిలో కొత్త ఆశలను రేకెత్తిస్తాయి. వాళ్లిద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారుతుంది. సంజనకి చూపులేని కారణంగా సంబంధాలు రావడమే కష్టమై పోతుంది. వచ్చిన సంబంధాలు ఆమె పెంచుతున్న పిల్లల కారణంగా వెళ్లిపోతుంటాయి. అలాంటి సమయంలో ఆమె రాజ్ ను ప్రేమించడం బామ్మకు ఆనందాన్ని కలిగిస్తుంది. ఇక ఒంటరిగా మిగిలిపోయిన దగ్గర నుంచి కుమిలిపోతున్న రాజ్, సంజన రాకతో సంతోషంగా ఉండటం కిశోర్ దంపతులకు ఆనందాన్ని ఇస్తుంది. సంజన – రాజ్ పెళ్లి చేసుకుందామని అనుకుంటూ ఉండగా ఒక అనూహ్యమైన సంఘటన జరుగుతుంది. అదేమిటి? అది వాళ్ల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుంది? అనేది కథ.చూపులేని అమ్మాయి .. కాళ్లు లేని అబ్బాయి. ఒకరు కవి అయితే .. మరొకరు గాయని. అలాంటి ఈ ఇద్దరి మధ్య నడిచే ప్రేమకథ ఇది. ఇద్దరూ ఆయా సందర్భాలలో తల్లిదండ్రులను కోల్పోయినవారే. అలాంటి ఆ ఇద్దరూ కలిసి నడవాలని అనుకుంటారు కలిసి బతకాలని నిర్ణయి ంచుకుంటారు. సన్నిహితు లంతా వాళ్ల నిర్ణయం పట్ల హర్షాన్ని వ్యక్తం చేస్తారు. అలాంటి ఆ సమయంలో ఏం జరిగిందనే ఒక అంశం చుట్టూ దర్శకుడు ఈ కథను నడిపించాడు.



Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449